# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం
1 ఆగస్టు
2026


## భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు
# కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలి**

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**





**నిర్మల్ ప్రతినిధి, జూలై 31 ( నినాదం):** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రాజెక్టుల పరిస్థితి, పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో భారీ వర్షాల వలన ప్రాజెక్టుల నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో--ఔట్‌ఫ్లో పరిస్థితులు, దెబ్బతిన్న రహదారులు, వంతెనల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ, రహదారులు, వంతెనలు దెబ్బతిన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు వస్తున్న ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి పంటకు బదులుగా ఆయిల్‌పామ్, కంది, నువ్వులు, పత్తి తదితర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. కొత్త పంటల సాగుకు అవసరమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొంటూ రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలని సూచించారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాయని తెలిపారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు వేగంగా చేపడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా తాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. రైతులు పంట మార్పిడి విధానాలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తోందని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, గతంలో జిల్లాలో 38 శాతం వర్షపాతం లోటు ఉండగా ప్రస్తుతం అది 6 శాతానికి తగ్గిందని తెలిపారు. జిల్లాలోని 21 మండలాల్లో 17 మండలాలు సాధారణ వర్షపాతం స్థితికి చేరుకున్నాయని పేర్కొన్నారు. గతంలో నీటి ఎద్దడి మండలాలుగా ఉన్న ఇంద్రవెల్లి, భోరజ్, సిరికొండ, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాలు ప్రస్తుతం సాధారణ పరిస్థితికి చేరుకున్నాయని వివరించారు. ఈ ఏడాది జిల్లాలో 5,93,670 ఎకరాల్లో పంటల సాగు నమోదైందని, అందులో 4,37,698 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే కంది సాగు 44 వేల ఎకరాల నుంచి 56,751 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా జి. జానకి షర్మిల, నిర్మల్, ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజేశ్వర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## అమ్మవారి జాతరకు
# ముస్తాబైన క్వారీ ప్రాంగణం

**దుర్గామాత జాతరకు పోలీసుల విస్తృత ఏర్పాట్లు**

**ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు పరిశీలన**





**మంచిర్యాల, జూలై 31 (నినాదం):** ఆగస్టు 2వ తేదీన మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ క్వారీ దుర్గా మాత జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే ఈ జాతర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు చర్యలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జాతర ప్రాంగణాన్ని, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు, అత్యవసర సేవలు అందించే కేంద్రాలు, తాగునీటి సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు వంటి అంశాలపై ఆలయ కమిటీతో సమగ్రంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. జాతరకు వచ్చే భక్తుల రాకపోకల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. జాతర ప్రాంగణంలో అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని మోహరించి ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రద్దీ ఎక్కువ గా ఉండే ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు. అనంతరం అధికారులు జాతరకు వెళ్లే మార్గంలో ఉన్న రాళ్లవాగు వంతెనను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వంతెన వద్ద భక్తులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వంతెన వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కార్మెల్ స్కూల్, గ్రీన్ సిటీ జంక్షన్ మీదుగా..** జాతరకు వెళ్లే భక్తులు కార్మెల్ స్కూల్, గ్రీన్ సిటీ జంక్షన్ మీదుగా అండాలమ్మ కాలనీ మార్గం ద్వారా జాతరకు చేరుకోవాలని పోలీసులు సూచించారు. సూచించిన మార్గాలను పాటించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు భక్తులు సులభంగా జాతర ప్రాంగణానికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర సందర్భంగా ప్రజలు క్రమశిక్షణ పాటించాలని, పోలీసుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే దుర్గామాత జాతర ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని తెలిపారు. భక్తుల సహకారంతో జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.

## ధాన్యం స్కామ్ పై బీజేపీ నేత సురేష్ రెడ్డి సంచలన సవాల్

**ఎమ్మెల్యేకు దమ్ముంటే విజిలెన్స్ విచారణ కోరాలి**

**అదనపు తూకం వేయలేదని రైతుల మధ్య చర్చ కు వచ్చే దమ్ముందా**

**సీబీఐ, ఈడీకి ఆధారాలు ఇస్తానంటూ హెచ్చరిక**

**రైస్ మిల్లలపై మరోసారి ఘాటు వ్యాఖ్యలు**

**బిజెపి నేత గొట్టేముక్కుల సురేష్ రెడ్డి**



**సుల్తానాబాద్, జులై 31 (నినాదం):** రైతులను నిండా ముంచి వందల కోట్లు వెనుకేసు కున్నారని రైస్ మిల్లర్లపై బిజెపి నేత గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, సీఎం ఆర్ తరలింపులో భారీ అవకతవకలు జరిగాయని ఆ రోపిస్తూ ఆయన మరోసారి ఘాటు వ్యాఖ్యలు చే శారు. రైతులను మోసం చేసి వందల కోట్ల కుంభ కోణం జరిగిందని ఆరోపించిన ఆయన, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమ ణారావుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విజిలెన్స్ వి చారణకు ప్రభుత్వాన్ని కోరాలని సవాల్విసిరారు. ధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకాలతో రైతు లను నష్టపరిచారని, దీనికి సంబంధించిన వీడి యోలు, ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలి పారు. ఈ వ్యవహారంలో సివిల్ సప్లై అధికారులు, గోదాం నిర్వాహకులు, రైస్ మిల్లర్ల పాత్రపై కూడా విచా రణ జరగాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను సీబీఐ, ఈడీకి అందజేస్తానని, కుంభకోణంలో బా ధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొన సాగిస్తానని స్పష్టం చేశారు. రైతుల మధ్య బహి రంగ చర్చకు రావాలని రైస్ మిల్లర్లకు సవాల్ విసి రిన ఆయన, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని నిరూపించగలరాఅని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షు డు కందుల శ్రీనివాస్‌తో పాటు ప్రధాన కార్యదర్శి కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత, ఎర్రం సంతోష్ రెడ్డి, మల్కా భాగ్య లక్ష్మి, వలస సాయి కిరణ్ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల
# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**


**రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకం**

**ప్రజల ప్రాణ,ఆస్తుల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి**

**చెరువులు,గోదావరి పరివాహక ప్రాంతాలు,లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి**

**ముంపుకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలి**

**జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**





**పెద్దపల్లి రూరల్,జూలై-30(నినాదం):** గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు,రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ,ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ,జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు,సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు,జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు.చెరువుల్లో గండ్లు,నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీట మునిగిన కాజ్‌వేలు,లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని,అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు,జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు .మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు,పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి,పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.గ్రామ సర్పంచు లు,మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌ప ర్సన్లు తదితర స్థానిక ప్రజాప్ర తినిధులతో సమన్వయం చేసుకు ంటూ సహాయక చర్యలను సమర్థ వంతంగా నిర్వహించాలని సూచించారు. నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరా వాస కేంద్రాలకు తరలించి, అక్క డ ఆహారం, తాగునీ రు,వస తి, తదితర అన్ని మౌలిక సౌకర్యా లను కల్పించా లని ఆదేశించా రు.అలాగే శిథిలా వస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సుర క్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నా రు.ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారు లు విద్యుత్ సరఫరా పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి,దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు.గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపో కలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుం డా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య,సంబంధిత శాఖల అధికారులు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన ఉపసర్పంచ్ ల ఫోరం**



**పెద్దపల్లి రూరల్,జూలై 29(నినాదం):** పెద్దపల్లి జిల్లా పరిధిలోని 262 గ్రామ పంచాయతీల్లో ఇటీవల ఎన్నికైన ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం ప్రతినిధులు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు జంగ్ అనిల్ ఆధ్వర్యంలో బుధవారం ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఫోరం నాయకులు గ్రామాల్లో తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులకు సరైన గుర్తింపు,అధికారాలు,గౌరవ వేతనం కల్పించాలని ఫోరం నాయకులు కోరారు. అలాగే ఉపసర్పంచ్‌లకు నెలకు రూ. 5,000, వార్డు సభ్యులకు రూ. 3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా,పంచాయతీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు,తీర్మానాలు, చెక్కులపై ఉపసర్పంచ్‌లకు సంతకం చేసే అధికారం కల్పించాలని,మండల స్థాయిలో నిర్వహించే గ్రామాభివృద్ధి సమావేశాలకు ఉపసర్పంచ్‌లను కూడా ఆహ్వానించి వారికి తగిన గుర్తింపు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు జంపన్న (జానీ),నాయకులు బోనగిరి అజయ్ కుమార్,ఎలిగేటి మల్లేశం,తీగుల్ల సతీష్ రెడ్డి,బరత స్వామి, సామల నాగభూషణం,అరిగె రవికుమార్,తమ్మనవేణి రాజయ్య, కత్తెర్ల లచ్చయ్య, తడ్వాయి ప్రమోద్ రెడ్డి,కోల తిరుపతి,బెజ్జంకి యమున రాజేందర్,అయిలవేని తిరుపతి, దయ్యాల రజిత,రాకేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలో నిబద్ధతకు ఘన గౌరవం..!!

**జిల్లా ట్రెజరీ సహాయ సంచాలకుడు కొండ కరుణాకర్‌కు ఆత్మీయ సన్మానం**

**సేవా ప్రస్థానాన్ని కొనియాడిన జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, తహసీల్దార్ తూము రవీందర్**





**గోదావరిఖని జులై 31 (నినాదం):** ప్రభుత్వ సేవలో అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన జిల్లా ట్రెజరీ కార్యాలయం సహాయ సంచాలకుడు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీఓస్)సంఘం పెద్దపల్లి జిల్లా కోశాధికారి కొండ కరుణాకర్కు జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మాన ం నిర్వహించారు. జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు, తహసీల్దార్ తూము రవీందర్ శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి కరుణాకర్‌ను సత్కరించారు. ప్రభుత్వ సేవలో ఆయన చూపిన నిబద్ధత, ఉద్యోగుల సంక్షేమం కోసం చేసిన కృషిని కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీజీఓస్ సంఘం నాయకులు డా. గుండా సురేష్, సాజిద్ అలీ, రవీంద్రనాథ్, డా. మల్లేష్, టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి సందీప్ రెడ్డి, ఏటీఓ రమేష్, వివిధ సబ్ ట్రెజరీ అధికారులు, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు, పదవీ విరమణ పొందిన ఏటీఓ దేవేందర్, మాజీ జిల్లా ట్రెజరీ అధికారి, ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులు, అకౌంటెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వైద్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. 'సేవే ఆయనకు గుర్తింపు' ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, కొండ కరుణాకర్ తన సేవా కాలంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ సహచర ఉద్యోగుల ఆదరణను పొందారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాభినందనలు తెలిపారు.

# రేపటి ప్రతిభకు నేటి నవోదయ పిలుపు

**పేద, గ్రామీణ విద్యార్థులకు బంగారు అవకాశం**

**దరఖాస్తు గడువు ఆగస్టు 7వరకు పొడిగింపు**




**మంచిర్యాల, జులై 31 (నినాదం):** ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితులు సహకరించక ఎంతో మంది విద్యార్థులు తమ కలలను మధ్యలోనే వదిలేస్తుంటారు. అలాంటి పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు జవహర్ నవోదయ విద్యాలయాలు ఆశాదీపంగా నిలుస్తున్నాయి. నాణ్యమైన విద్య, వసతి, భోజన సదుపాయాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న నవోదయలో ప్రవేశానికి ఇదే చివరి అవకాశం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థుల కోసం కాగజ్‌నగర్ లో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాది ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నవోదయ విద్యాలయ సమితి జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. 2027-28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు గడువు ఆగస్టు 7 పొడిగించారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**నవోదయలో అడుగు పెడితే.. భవిష్యత్తుకు భరోసా..**

నవోదయ విద్యాలయంలో ప్రవేశం సాధించడం అనేది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశంగా భావిస్తారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇక్కడ ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్య అందుతుంది. చదువుతో పాటు వసతి, భోజనం, పాఠ్యేతర కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన అందిస్తున్నారు.

**పేదింటి పిల్లలకు పెద్ద అవకాశం**

గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నవోదయ ప్రత్యేక అవకాశం కల్పిస్తోంది. మొత్తం 80 సీట్లలో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కేటాయిస్తారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తారు. బాలికలకు కూడా మొత్తం సీట్లలో మూడో వంతు సీట్లు కేటాయించడం ద్వారా సమాన అవకాశాలు కల్పిస్తున్నారు.

**అర్హతలు ఇవే..**

ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. అలాగే విద్యార్థులు మూడో, నాలుగో తరగతులు కూడా ఇదే ఉమ్మడి జిల్లా పరిధిలో చదివి ఉండాలి. 01-05-2015 నుంచి 31-07-2017 మధ్య జన్మించిన విద్యార్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులు.

**నవంబర్ 28న ప్రవేశ పరీక్ష**

దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ 28న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవోదయలో ప్రవేశం లభిస్తుంది.

**తల్లిదండ్రుల ఆశలకు నవోదయ అండ**

గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతో మంది తల్లిదండ్రులకు తమ పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలనే ఆశ ఉంటుంది. అయితే ప్రైవేటు విద్య భారంగా మారుతున్న తరుణంలో నవోదయ వంటి విద్యాసంస్థలు వారికి గొప్ప ఊరటనిస్తున్నాయి.

ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన విద్యార్థి కూడా నవోదయలో చదివి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. అందుకే అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని కోల్పోకుండా దరఖాస్తు చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**ఉచితంగా ఆన్లైన్ లో దరఖాస్తు...**

అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక ఆన్లైన్ పోర్టల్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో విద్యార్థి ఫొటో, విద్యార్థి సంతకం, తల్లిదండ్రుల సంతకం, ఆధార్ వివరాలు లేదా నివాస ధ్రువీకరణ పత్రం, అవసరమైనప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయాలి. దరఖాస్తు ప్రక్రియలో సహాయం కోసం అవసరమైన విద్యార్థులు సమీప జవహర్ నవోదయ విద్యాలయంలో అందుబాటులో ఉండే ఉచిత హెల్ప్ డెస్క్ సేవలను వినియోగించుకోవచ్చు.

**ఎంపిక ప్రక్రియ..**

ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. పరీక్ష ఫలితాలు 2027 మార్చి చివరి వారంలో వెలువడే అవకాశం ఉంది.

శనివారం, తెలంగాణ
01 ఆగస్టు 2026

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## జనసేన అభ్యుదయ గర్జన సమావేశాన్ని విజయవంతం చేద్దాం

కోడిగంటి సాయి



**రేవల్లి, న్యూస్ జులై 31 (నినాదం) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భూత్పూర్ రోడ్డులోని ఏ.ఎస్.ఎన్. ఫంక్షన్ హాల్లో ఆగస్టు 1న నిర్వహించనున్న జనసేన అభ్యుదయ గర్జన సమావేశాన్ని విజయవంతం చేయాలని వనపర్తి నియోజకవర్గ జనసేన నాయకులు కోడిగంటి సాయి పిలుపునిచ్చారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, రాష్ట్ర నాయకులు రామ్ తాళ్లూరి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలోని జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధిహామీ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి



**మహాముత్తారం, జూలై 31(నినాదం):** ఎస్ఆర్డీఎస్ ఎఫ్టీఈ ఉద్యోగులకు వెంటనే పే స్కేల్ అమలు చేయడంతో పాటు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో ఉపాధిహామీ ఉద్యోగులు పెన్డౌన్ నిర్వహించారు. ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో సేవలందిస్తున్నప్పటికీ, వేతనాలు 3--4 నెలల ఆలస్యంగా చెల్లించడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పే స్కేల్ అమలు, పెండింగ్ వేతనాల విడుదల, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ అమలు తదితర డిమాండ్లను ఆగస్టు 15లోపు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎం. కుమారస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు ఎం. రవీందర్, ఎల్. సురేందర్, బీఎఫ్‌టీ డి. ప్రమీల, కంప్యూటర్ ఆపరేటర్లు డి. రాజ్‌కుమార్, ఎండీ షఫీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కుప్పకూలిన గూడు..!

నిలువనీడ కోల్పోయిన పేద మహిళ



**మహాముత్తారం, జూలై 31(నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి గ్రామానికి చెందిన కొయ్యల రాజక్క అనే మహిళ నివాసం ఉంటున్న ఇల్లు గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నేలమట్టమైంది. ఒక్కసారిగా ఇల్లు కూలిపోవడంతో ఆమె నిరాశ్రయురాలిగా మారింది. ఇంట్లోని నిత్యావసర సామగ్రి, గృహోపకరణాలు కూడా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే నివసించడానికి సైతం చోటు లేక తీవ్ర ఆందోళనలో ఉన్న బాధితురాలు ప్రభుత్వ సాయంపైనే ఆశలు పెట్టుకుంది. తాను అత్యంత నిరుపేదనని, సొంతంగా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేదని పేర్కొంటూ ఇందిరమ్మ గృహ పథకం కింద వెంటనే ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కొయ్యల రాజు వేడుకుంది. సంబంధిత అధికారులు వెంటనే ఘటనాస్థలాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసి తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ప్రజల మనసును గెలిచిన వ్యక్తి పెద్ది సుదర్శన్ రెడ్డి

ఆయన మృతి బాధాకరం

బిఆర్ఎస్ పార్టీ నాయకులు శేరినారాయణ రెడ్డి



**కొడంగల్, జులై 31(నినాదం):** బిఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, ఉద్యమనేత పెద్దిసుదర్శన్ రెడ్డి ప్రజల మనసును గెలిచిన వ్యక్తి అని, మృతి బాధాకరం అని బొంరాస్ పేట్ మండల బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ ఎంపిపి శేరినారాయణ రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన మలిదశ ఉద్యమంలో సుదర్శన్ రెడ్డి పాత్ర మాటల్లో చెప్పలేనిదని, ప్రాణాలకు తెగించి పోరాడిన వారిలో సుదర్శన్ రెడ్డి పాత్ర గొప్పదని పేర్కొన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే గా ప్రజాసేవలో ఏనాడూ రాజీపడలేదని,అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్




**అమరచింత, జూలై 31, (నినాదం)**: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పజలు జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపాలను చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశాల మేరకు శుక్రవారం అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని మూడవ వార్డులో ఫ్రైడే – ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్, కమిషనర్, వార్డు కౌన్సిలర్ తిరుమలేష్, డాక్టర్ మానస మాట్లాడుతూ మూడో వార్డులో కాలనీవాసులు అందరు ఒకే దగ్గర చెత్త వేయడాన్ని చూసి వారికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ సిబ్బంది చేత చెత్తనంత తొలగించి డంపు యార్డుకు తరలించారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడుతూ చెత్తను చెత్త బండిలో వేయాలని అలా కాకుండా కాలనీ మధ్యలో వేస్తే ఆ కాలనీవాసులు అందరికీ వ్యాధులు సోకుతాయని తెలిపారు. చెత్త బండి లోనే పొడి చెత్త తడి చెత్తను వేరు చేసి వేయాలని సూచించారు. అనంతరం చెత్తను తొలగించిన ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ లు చల్లారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, పురపాలక సిబ్బంది, ఆశా వర్కర్లు కాంగ్రెస్ నాయకులు జింక రవి, రవికాంత్ కమలాకర్ గౌడ్ తో పాటు పార్సిద సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

**క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్‌భరో కార్యక్రమం**




**అశ్వాపురం, జూలై 31(నినాదం):** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సమరశంఖం పూరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం అశ్వాపురంలోని మంచికంటి భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు...జె. రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. పద్మ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా సంపదను ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించడం ద్వారా ఎనిమిది గంటల పని హక్కు, ఉద్యోగ భద్రత, కనీస వేతన హక్కు, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులను బలహీనపరిచిందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించాలని దేశవ్యాప్తంగా డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అమెరికాతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ రైతాంగం నష్టపోతుందని పేర్కొన్నారు. పత్తి, మొక్కజొన్న, పాల ఉత్పత్తులు, కోడి కాళ్ల దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తూ గ్రామీణ పేదల జీవనోపాధిపై కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబీజీఆర్ఏఎం చట్టం, నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాల వల్ల రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలపై అదనపు భారాలు పడతాయని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, రైతు సంఘం మండల కార్యదర్శి సాంబశివరావు, మండల నాయకులు అశోక్‌రెడ్డి, జె. రామలక్ష్మి, సరిత, రమణ, పూలమ్మ, ఉప్పలమ్మ, విజయలక్ష్మి, పద్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మేఘ ఉచిత వైద్య శిబిరం



**అల్వాల్, జులై 31 (నినాదం):** లయన్స్ క్లబ్ ఆఫ్ మేడ్చల్ సహకారంతో గణేష్ టెంపుల్ అల్వాల్ మెయిన్ రోడ్డు వద్ద, ఏ1 కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ చెకప్, ఊపిరితిత్తుల పరీక్ష, ఆర్థోపెడిక్ బిపి మొదలగు వాటికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ పి అశోక్( ఎండి), లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ బాలసుధన్, లయన్ శ్రీధర్ రెడ్డి, జోనల్ చైర్పర్సన్ జ్యోతి మనోజ్, తాజేందర్ కోర్, నాజ్,అజయ్ గార్గ్,శ్రీరాములు, సిమర్జిత్ సింగ్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రముఖ న్యాయవాది ఎం.ఏ. అబ్దుల్ రజాక్‌కు ఘన నివాళులు

**న్యాయవాదుల సంఘం, అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పణ -- కుటుంబ సభ్యులకు పరామర్శ**



**కొత్తగూడెం(చుంచుపల్లి), జూలై 31 (నినాదం):** ప్రముఖ సీనియర్ న్యాయవాది, అంబేద్కర్ వాది, మాజీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు స్వర్గీయ ఎం.ఏ. అబ్దుల్ రజాక్ (65) అకాల మృతిపై న్యాయవాదుల సంఘం, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం చుంచుపల్లి హౌసింగ్ బోర్డ్‌లోని ఆయన స్వగృహాన్ని సందర్శించి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ న్యాయాధిపతి మెండు రాజమల్లు, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ, అబ్దుల్ రజాక్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. పేద ప్రజలకు న్యాయ సహాయం అందించడంలో, సమ సమాజ స్థాపన కోసం పోరాడడంలో, అంబేద్కర్ సిద్ధాంతాల ప్రచారంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కొత్తగూడెంలో సీనియర్ న్యాయవాదిగా, కాంగ్రెస్ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా, న్యాయశాస్త్రంలో అపార పాండిత్యం కలిగిన వ్యక్తిగా, అన్యాయానికి ఎదురొడ్డి నిలిచిన ధీరుడిగా, రచనా నైపుణ్యం, వాగ్ధాటి, మానవత్వంతో ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా రజాక్ సేవలను గుర్తు చేసుకున్నారు. జూలై 30 తెల్లవారుజామున గుండెపోటుతో ఆయన కన్నుమూశారని, గత ఏడాదే ఆయన సతీమణి కూడా మరణించగా, ప్రస్తుతం న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు. త్వరలో అబ్దుల్ రజాక్ స్మారకార్థం సంయుక్త ఆధ్వర్యంలో సంతాప సభను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అబ్దుల్ రజాక్ పార్థివదేహాన్ని దర్శించి నివాళులర్పించిన వారిలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా తదితరులు ఉన్నారు. అంతిమయాత్రలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమ్ ఖురేషి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సెషన్స్ జ్యుడీషియరీ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, జనప గోపీకృష్ణ, కాసాని రమేష్, సాయి కృష్ణ, సబ్బారపు మధుసూదన్ చిన్ని, సోమరాజ్, గుండా రమేష్, పీ. సురేందర్, సల్మాన్ ఖాన్ తోతా, అల్లి శంకర్, సినీనటుడు తాండూర్ ధనరాజ్, జహంగీర్ ఖాన్, మహమ్మద్ షఫీ అహ్మద్, కేదాసి పీటర్ బాబు, అన్వర్ భాయ్, బిక్కులాల్, పాషా భాయ్, అడ్వకేట్ శ్రీనివాస్, రమేష్, బొమ్మెర అశోక్, మచ్చ పృథ్వీరాజ్, రాజేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొని అబ్దుల్ రజాక్‌కు ఘన నివాళులర్పించారు.

## ఆగస్టు 15లోపు కురుమ కార్పొరేషన్ ఏర్పాటు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



**ఆలేరు, జూలై 31(నినాదం):** రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆగస్టు 15వ తేదీలోపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శాలువాతో ఘనంగా సన్మానం చేసి, కురుమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా కురుమ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆగస్టు 15వ తేదీలోపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు బీర్ల అయిలయ్య వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా కురుమ సామాజిక వర్గం ఎదురుచూస్తున్న ఆకాంక్ష నెరవేరబోతోందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీతో రాష్ట్రవ్యాప్తంగా కురుమ సమాజంలో ఆనందం వెల్లివిరుస్తోందని ఆయన పేర్కొన్నారు. కురుమల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీని ద్వారా ఆ వర్గానికి మరిన్ని సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అందే అవకాశం ఉంటుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యావత్ కురుమ కులస్తుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్ ఎగ్గె మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కురుమల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సామాజిక న్యాయానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## తుమ్మలచెరువు ఆయకట్టుకు సీతారామ జలాలు విడుదల చేయాలి

ఇరిగేషన్ ఈఈకు మొండికుంట,సీతారాంపురం సర్పంచ్‌ల విజ్ఞప్తి



**అశ్వాపురం, జూలై 31 (నినాదం):** ఈ ఖరీఫ్ సీజన్‌లో తుమ్మలచెరువు ఆయకట్టుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయాలని కోరుతూ ఇరిగేషన్ శాఖ ఈఈ లిలితెల్లం వెంకటేశ్వర్లులిలికు మొండికుంట గ్రామ సర్పంచ్ లిలిమర్రి సంధ్య, సీతారాంపురం గ్రామ సర్పంచ్ సప్క పిచ్చయ్య శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో తుమ్మలచెరువులో నీటి నిల్వలు లేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే రైతులు నార్లు పోసి ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారని, ఈ పరిస్థితుల్లో తక్షణమే సీతారామ కెనాల్ లేదా మారెళ్లపాడు మార్గం ద్వారా తుమ్మలచెరువు ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు చేపట్టి సాగునీటిని అందించాలని వారు ఇరిగేషన్ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, దైదా నారాయణరెడ్డి, బద్దం వెంకటరెడ్డి, ముద్దం సైదిరెడ్డి, మందడి అరుణాకర్ రెడ్డి, సంద్ర లక్ష్మణరావు తదితర రైతులు పాల్గొన్నారు.

## భాజపా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా యంపల్ల సిద్ధారెడ్డి నియామకం



**అశ్వాపురం, జూలై 31(నినాదం):** భారతీయ జనతా పార్టీ (భాజపా) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అశ్వాపురం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన యంపల్ల సిద్ధారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్వంచలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధారెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యంపల్ల సిద్ధారెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, రాష్ట్ర నాయకుడు ముస్కు శ్రీనివాస రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ అశ్వాపురం మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పగడాల కృష్ణారెడ్డి, పూసం శ్రీనివాసరావు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవల్లిలో ఏబీ స్విచ్‌ల ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు చెక్

రేవల్లి మండల ఇన్చార్జి ఏఈ సురేష్ చారి



**రేవల్లి, జూలై 31 (నినాదం) :** రేవల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ ఫీడర్‌కు ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడంతో రైతులకు, పట్టణ విద్యుత్ వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనం కలగనుంది. ఇకపై వ్యవసాయ లైన్‌లో ఎక్కడైనా బ్రేక్‌డౌన్ జరిగినా సిబ్బంది కేవలం 10 నిమిషాల్లో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంటుంది. అలాగే గతంలో ఏదైనా రైతు పొలంలో ఫ్యూజ్ పోయినా లేదా వ్యవసాయ లైన్‌లో లోపం ఏర్పడినా, రేవల్లి పట్టణ ప్రజలకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ఏబీ స్విచ్‌ల ఏర్పాటు అనంతరం వ్యవసాయ, పట్టణ విద్యుత్ సరఫరాలను అవసరానికి అనుగుణంగా వేర్వేరుగా నిర్వహించేందుకు వీలుకావడంతో ఇకపై ఆ సమస్య తలెత్తదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## పెద్ది మృతికి పలువురి నేతల ప్రగాఢ సంతాపం


**హన్మకొండ,జూలై31, (నినాదం):** ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యులు,పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మృతిపట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే రిటైర్డ్ ఐ పీ ఎస్ అధికారి కే ఆర్ నాగరాజు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది పోషించిన పాత్ర కీలకమైందని కొనియాడారు. నర్సంపేట ఎమ్మెల్యేగా ప్రజల పట్ల చూపిన అంకితభావంతో చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించి చేసిన అభివృద్ధి పనులు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన మరణం తెలంగాణ రాజకీయాలకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు,అభిమానులకు, అనుచరులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## స్కూల్ గ్రౌండ్‌లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి



**అమరచింత, జూలై 31 (నినాదం):** అమరచింత హై స్కూల్ గ్రౌండ్ లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీ రాఘవేంద్ర జిల్లా కమిటీ సభ్యులు బాలకృష్ణ మాట్లాడుతూ అమరచింత హై స్కూల్ గ్రౌండ్ లో ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసేవారు క్రీడాకారులు కానీ అలాగే వాకర్స్ కానీ అందరు కూడా బహిరంగంగా మూత్రం చేసే పరిస్థితి ఏర్పడిందని దాని వలన స్కూల్లో చదువుకుంటున్నటువంటి విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తున్నవి ఆ విద్యార్థులు ఏదైనా ఆటలు ఆడే సమయంలో అందరూ మూత్ర విసర్జన చేసిన దాంట్లోనే తిరిగే పరిస్థితి అలాగే దుర్వాసనతో విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇబ్బంది అవుతుంది కాబట్టి ఆర్టీసీ బస్టాండ్లలో మూత్రశాలలు ఏ విధంగా అయితే పురుషులకు ఉంటాయో అలా గ్రౌండ్ లో ఏదో ఒక మూలకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రౌండ్ మొత్తం పందుల బెడద ఎక్కువ ఉంది కాబట్టి దానిపై కూడా దృష్టి పెట్టి గ్రౌండ్ ని శుభ్రపరచాలని కమీషనర్‌కు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాము షారుఖ్,పోషన్న, రుక్మదిన్ తదితరులు పాల్గొన్నారు.

## తిప్పర్తి యాదయ్యకు ఉద్యమకారుల సత్కారం



**అల్వాల్, జుల 31(నినాదం):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ జాయింట్ కమిషనర్ తిప్పర్తియాదయ్య, డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా అల్వాల్ ఉద్యమకారులు ఘనంగా వారికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, దయాకర్ ,మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

శనివారం । తెలంగాణ
1 ఆగస్టు 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి



**గద్వాల ప్రతినిధి జులై 31 (నినాదం):** ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయి తేజ ఒకేషనల్ జూనియర్ కళాశాల, అరోరా జూనియర్ కళాశాలలో నిర్వహించిన "ఫీజుల బకాయి--బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థుల చదువులు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు. మూడేళ్లుగా బకాయిలు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పీఎం శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా, ఓబీసీ మోర్చా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ కోదండ రామాలయం శంకుస్థాపనకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆహ్వానం...

బాక్స్ డ్రైనేజీ నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ

జోనల్ కమిషనర్‌కు వినతి



**మల్కాజిగిరి, జులై 31 (నినాదం):** విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీ వాసులు ఆగస్ట్ మూడవ తేదిన చేపట్టబోయే శ్రీ కోదండ రామాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ శుక్రవారం మాజీ కార్పొరేటర్ నిరు గౌండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయం సభ్యులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. కాలనీ లో ఎదుర్కుంటున్న డ్రైనేజీ సమస్య నివారణ కొరకు బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం ను అందజేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే లెటర్ హెడ్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కి ఇవ్వడం, ఓల్డ్ నేరెడ్ మెట్ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే ఇచ్చిన లెటర్ హెడ్ పత్రాన్ని జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్ ను కలిసి వినతి పత్రం ను అందజేశారు. ఈ కార్యక్రమం లో విష్ణుపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు కోదండ రామాలయం అధ్యక్షులు పప్పు శర్మ, సెక్రటరీ నాగరాజు, బి. టీ. నాయక్, రామచంద్ర, బాబు నాయక్, రామారావు, శంకర్ రావు, ప్రసాదరావు, గిరిరాజ్, లింగ మూర్తి, రవీందర్, గౌడ సంఘం స్మశాన వాటక సభ్యులు టి. నరేందర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, టి. పవన్ గౌడ, ఎం. శ్రీకాంత్ గౌడ్, సి. విశ్వనాథ్ గౌడ్, జహంగీర్ గౌడ్, జె. అభిషేక్ గౌడ్, జి. ప్రవీణ్ గౌడ్, ఎ. శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సమస్యల పరిష్కారానికి సహకరించాలి.. ఎస్సై అనిల్‌కు టీజీవీపీ వినతి



**భిక్కనూర్, జూలై 31 (నినాదం):** భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అనిల్‌ను తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి పోలీస్ శాఖ సహకారం అందించాలని కోరారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎస్సై అనిల్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు సంజయ్, కామారెడ్డి టౌన్ ఇన్‌చార్జ్ సమీర్, భిక్కనూర్ మండల అధ్యక్షుడు భరత్, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌తో పాటు శివ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి

తపస్ మానుకోట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

జంజీరాల నాగరాజు గుడిబోయిన గోపికృష్ణ




**తొర్రూరు, జులై 31 (నినాదం):** నినాదం న్యూస్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలన్నా, పి ఆర్ సి అమలు, డి ఏ లు విడుదలజరగాలన్న ఉద్యోగ ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడవలసిన సమయంఆసన్నమైందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాడకుండా ఏమిసాధించలేని పరిస్థితి వచ్చిందని అందుకే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘంరాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రకటించిన దశలవారీ కార్యాచరణలో భాగంగా చివరి దశపోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు వేలాదిగా ఆగస్టు 1వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే రాష్ట్రవ్యాప్త మహాధర్నా కార్యక్రమానికి హాజరైఉద్యోగ, ఉపాధ్యాయు, పెసినేర్ల యొక్క శక్తిని ప్రభుత్వానికి తెలియచేయాలనితపస్ జిల్లా అధ్యక్షులు జంజీరాల నాగరాజు జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలియచేసారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగాఉద్యోగ, ఉపాధ్యాయులకు సి. పి. ఎస్ తొలగించి ఓ. పి. ఎస్ అమలుచేయాలని, అదేవిధంగా 317 బాధితుల కోసం తీసుకుని వచ్చిన 190 +టాలో భాగంగా అప్లైచేసుకున్న, అర్హులైన అందరూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే డిప్యూటేషన్లు ఇవ్వాలన్నారు.

# నకిలీ డీఏపీ తయారీ ముఠా గుట్టురట్టు

రూ.2 కోట్ల విలువైన నకిలీ ఎరువులు, యంత్రాలు స్వాధీనం

ఆరుగురు అరెస్ట్.. ఇద్దరు పరారీ

రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచన





**హుజూర్‌నగర్, జూలై 31 (నినాదం):** తెలంగాణలో డీఏపీ ఎరువుల కొరతను అవకాశంగా మలుచుకుని అమాయక రైతులను మోసం చేస్తున్న నకిలీ డీఏపీ తయారీ ముఠాను మఠంపల్లి పోలీసులు ఛేదించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం గ్రామానికి చెందిన ఏ-1 కొండేటి పిచ్చిరెడ్డి రైతులకు నకిలీ డీఏపీ బస్తాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దర్యాప్తులో ఏ-2 పోలే వెంకటేశ్వర్లు అలియాస్ రాజు, ఏ-3 పింజారి మౌలాలి, ఏ-4 షేక్ అబ్దుల్ రహమాన్, ఏ-7 హీర్లకొండ సంతోష్ కుమార్, ఏ-8 పింగళి గంగా మహేశ్వర్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు తేలడంతో వారిని అరెస్టు చేశారు. ఏ-5 జగదీష్ అలియాస్ జక్కప్ప, ఏ-6 ఆనంద్‌రావు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది. దర్యాప్తులో హైదరాబాద్ పెద్ద అంబర్‌పేటలో నకిలీ డీఏపీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వివిధ రాష్ట్రాల నుంచి ముడి సరుకులు తెప్పించి నకిలీ ఎరువులను తయారు చేసి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తయారీ, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ కోసం ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి అక్రమంగా కోట్ల రూపాయలు ఆర్జించినట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి ఒక డీసీఎం వాహనం, ఒక ఎర్టిగా కారు, ఐదు సెల్‌ఫోన్లు, 4,000--5,000 నకిలీ డీఏపీ బస్తాలు, ఎరువుల తయారీ యంత్రాలు, ప్రింటింగ్ మిషన్లు, ప్యాకింగ్ సామగ్రి, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వస్తువుల విలువ సుమారు రూ. 2 కోట్లుగా అంచనా వేశారు.
డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద ఎరువుల విక్రయాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని, నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పథకాలు-సామాజిక అంశాలపై అవగాహన సదస్సు





**గద్వాల ప్రతినిధి జులై 31 (నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లా శెట్టి ఆత్మకూరు గ్రామంలో ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ (ఓఎంఐఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై అవగాహన సదస్సును సర్పంచ్ భాగ్యలక్ష్మి తో కలిసి ఓఎంఐఎఫ్ మండల కోఆర్డినేటర్లు వి. అనురాధ, పౌల్, నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా లేబర్ కార్డుల ప్రాముఖ్యత, వాటి ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. అలాగే సమృద్ధి సంయోజన ఇన్సూరెన్స్ పథకం గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. విలేజ్ సెక్రటరీ గీత కార్యక్రమానికి సహకరించారు. ఓఎంఐఎఫ్ మండల కోఆర్డినేటర్లు వి. అనురాధ, పౌల్, గద్వాల, ధరూర్ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు. ఒంటరి దళిత మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాతృత్వం చాటిన గ్రామ యువతను, గ్రామస్తులను అభినందించిన సర్పంచ్

విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధమైన కుటుంబాన్ని ఆదుకున్న పంచాయతీ యువకులు





**ములకలపల్లి, జూలై 31 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం మూకమామిడి పంచాయతీ లో గుట్టగూడెం గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఊకె రాజులు- రమణ దంపతుల ఇల్లు పూర్తిగా దగ్ధమై ఆపదలో ఉన్న కుటుంబాన్ని పంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి. యువకులు మరియు గ్రామ పెద్దలు అండగా నిలిచారు. ఇంట్లోని సామాన్లు, బట్టలు అన్నీ కాలిపోవడంతో రోడ్డున పడిన బాధిత కుటుంబానికి అండగా నిలిచి గొప్ప మనసు చాటుకున్నారు. విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి. గ్రామ యువకులు మరియు పెద్దలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి బట్టలు, బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు, వంటసామాన్లు మరియు నగదు సహాయం సామాగ్రిని అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని సర్పంచ్, యువకులు మరియు గ్రామ పెద్దలు బాధిత కుటుంబాన్ని ఓదార్చరు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న యువతను అభినందిస్తు పంచాయతీ అభివృద్ధిలో యువత ముందుకు రావాలి. ప్రతి ఒక్కరు ఆపదలో ఉన్న వారికి సాయం చేసే గుణం కలిగి ఉండాలి. ఇదే మన గ్రామ సంస్కృతి అని అన్నారు. గ్రామస్తుల సహాయానికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయం కూడా అందించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ దోమల అరుణ్ కుమార్, పంచాయతీ జిపిఓ నరసింహారావు, రామాలయం ఆలయ కమిటీ, వార్డు సభ్యులు కనితి వెంకటేశ్వర్లు, వివో ఏ సోయం లలిత, గ్రామ పెద్దలు శాస్త్ర బోయిన వెంకటేశ్వర్లు, దండం గోపాలరావు రాయల సాంబశివరావు, పైద కోటేష్, అనంతుల మురళి, కొప్పుల నరసయ్య, లక్ష్మణరావు, కణితి భీముడు, కణితి భద్రయ్య మరియు పాల్గొన్న యువకులు మెచ్చా నాగేశ్వరరావు, పోడియం ప్రేమ్ కుమార్, రింగు బాలకృష్ణ, కణితి రమేష్, పద్దం పాపారావు తదితర పంచాయతీ యువత గ్రామ మహిళలు సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకున్న యువతను గ్రామస్తులను పంచాయతీ ప్రజలు అభినందించారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ జలధార

తాగునీటి ట్యాంకుల శాస్త్రీయ పరిశుభ్రత

**కల్వకుర్తి జులై 31 (నినాదం):** తలకొండపల్లి మండల ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన స్వచ్ఛ జలధార. కార్యక్రమం తలకొండపల్లి మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని త్రాగునీటి నిల్వ ట్యాంకులను జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరిచారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, నాచు, వ్యర్థాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రతను నెలకొల్పడంతో పాటు త్రాగునీటి నాణ్యత మెరుగుపడేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడంతో పాటు గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన త్రాగునీరు.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అనే సందేశాన్ని ప్రజలకు అందించారు. ఇది కేవలం ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన సామాజిక బాధ్యతాయుత కార్యక్రమమని పేర్కొన్నారు.




ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల మల్లేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విజయ పాల సేకరణ ధర పెంచాలని పాడి రైతుల వినతి

**ఆమనగల్లు, జూలై 31 (నినాదం):** కడ్తాల్ మండలంలో విజయ పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాడి రైతులు వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ డైరీలతో పోలిస్తే విజయ డైరీ ధరలో ఐదు రూపాయల తేడా ఉందని, ఆవు పాలకు పది రూపాయలు, గేదె పాలకు ఐదు రూపాయలు పెంచాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డైరీ డిడి కవిత మరియు మేనేజర్ రాములుకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కద్దారి రామకృష్ణ, రంగయ్య, ఎలమందరెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



## నేడు రేవల్లి, ఏదుల మండల స్థాయి సమావేశాలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఉదయం రేవల్లి, మధ్యాహ్నం ఏదులలో సమావేశాలు

అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్ష..

అధికారులు, ప్రజాప్రతినిధులకు హాజరు సూచన



**రేవల్లి, ఏదుల, జూలై 31 (నినాదం):** వనపర్తి నియోజకవర్గంలోని రేవల్లి, ఏదుల మండలాల్లో నేడు (ఆగస్టు 1) శనివారం మండల స్థాయి సమావేశాలునిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది. ఉదయం 10:30గంటలకు రేవల్లి ఎంపీడీవో కార్యాలయంలో, మధ్యాహ్నం 2:30 గంటలకు ఏదులఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమావేశాలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ సమావేశాల్లో మండలాల వారీగా అభివృద్ధి పనులపురోగతి, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, శాఖలపనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరై తమశాఖలకు సంబంధించిన వివరాలతో సిద్ధంగా రావాలని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం సూచించింది. అదేవిధంగా సర్పంచులు, సింగిల్ విండో అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు కూడాసమావేశాలకు హాజరై మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చల్లో పాల్గొనాలని కోరింది.

## వీబీజీ రాంజీ ఉద్యోగుల పెన్‌డౌన్

పెండింగ్ వేతనాల విడుదలకు డిమాండ్..



**భీమదేవరపల్లి జూలై 31 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్ చేపట్టి తమ డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. పే స్కేల్ అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. నెలల తరబడి వేతనాలు ఆలస్యంగా రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పెన్‌డౌన్ ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీవో కుమారస్వామి, ఈసీ సుదర్శన్, టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, రవి, కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్, మానవ అక్రమ రవాణ చట్టరీత్యా నేరం

లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్





**గద్వాల ప్రతినిధి జులై 31 (నినాదం):** ర్యాగింగ్, మానవ అక్రమ చట్టరీత్యా నేరమని లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా పుటాన్పల్లి గ్రామంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలుర) జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, మానవ అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, విద్యార్థులు పరస్పరం గౌరవం, స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఉద్యోగాలు, విద్య తదితర అవకాశాల పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి. శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గార్డెన్ కాలనీలో 'పరిశుభ్రత'పై ప్రత్యేక అవగాహన

రోడ్లపై చెత్త వేయవద్దు: రామకృష్ణ రెడ్డి

తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండికే అందించాలి



ంనార్సింగి సర్కిల్ మణికొండ పరిధిలోని గార్డెన్ కాలనీలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై పడిఉండే చెత్త వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుందని, అందువల్ల చెత్తను రోడ్లపై వేయకుండా నేరుగా స్వచ్ఛ భారత్ ఆటోలోనే వేయాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. మన ఇళ్లను ఏ విధంగానైతే శుభ్రంగా ఉంచుకుంటామో, మన కాలనీ రోడ్లను కూడా అలాగే పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇళ్లలో చేరే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేరుచేసి స్వచ్ఛ బండికే అందించాలని సూచించారు. కాలనీని సుందరంగా, ఆరోగ్య కరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కార్యక్రమానికి విచ్చేసిన ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ చారి, కాలనీ కమిటీ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

శనివారం | తెలంగాణ
1 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## వరి పంటలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



**కోహెడ, జూలై 31 (నినాదం) :** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో పలు రైతుల వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి (హీూ) సతీష్ శుక్రవారం సందర్శించి పంట పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరానికి అవసరమైన నారుమడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. తరచుగా వరి కాండం తొలిచే పురుగు ఆశించే ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యగా నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లి కోడు వంటి తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నీటి లభ్యత ఆలస్యమైన కారణంగా దీర్ఘకాలిక వరి రకాల నారు నాట్లు ఆలస్యమైన ప్రాంతాల్లో 50 రోజుల వయస్సు గల నారు ఆకుల చివరలను త్రుంచి, ఒక్కో కుదురుకు 5 నుంచి 6 మొక్కల చొప్పున నాటాలని రైతులకు సూచించారు. అలాగే, నాటు అనంతరం ప్రతి రెండు మీటర్లకు కాలిబాట ఏర్పాటు చేయడం వల్ల గాలి, వెలుతురు సమృద్ధిగా ప్రసరించడంతో పాటు సుడిదోమ ఉధృతిని తగ్గించవచ్చని, ఎరువులు, పురుగుమందుల వినియోగం కూడా రైతులకు సులభతరం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, మహిపాల్ రెడ్డి, రఘు పాల్గొన్నారు. అలాగే రైతులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రాగుల వెంకటేష్, గడ్డం మహిపాల్ రెడ్డి, హరీష్ తదితరులు హాజరయ్యారు.

## విద్యుత్ ఉద్యోగులకు సాయిబాబా సేవలు అమోఘం

బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



**వనపర్తి ప్రతినిధి, జులై 31 (నినాదం):** విద్యుత్ ఉద్యోగులకు సాయిబాబా చేసిన సేవలు అమోఘమని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. ట్రాన్స్ కో 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా పదవి విరమణ కార్యక్రమం శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా సాయిబాబాను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులతో సాయిబాబా కలిసిమెలిసి ఉంటూ అందరి మన్ననలు పొందారని చెప్పారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, ఆ తర్వాత ప్రజా సేవలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గొర్ల కాపరుల సంఘం మాజీ అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, వనపర్తి 1104 సంఘం సెక్రటరీ వెంకటేష్, సుర రవీందర్, కర్రోళ్ల భాస్కర్, వంశీ తదితరులు పాల్గొన్నారు పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి.

## కలెక్టర్‌ను కలిసిన రాయగూడెం సర్పంచ్ వేణు



**పాలేరు జూలై 31( నినాదం):**గ్రామ పంచాయతీ లో నెలకొన్న వివిధ సమస్యల ను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు వినతి పత్రం అందించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తన చాంబర్ లో కలిసి వివిధ సమస్యలను వివరించారు. అదే విధంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పై నెలకొన్న వివాదం ను తెలియజేశారు. సమస్యను పరిష్కరించి భవన నిర్మాణం ను వెంటనే చేపట్టేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు బోయిన నరసింహారావు, బోయిన కిట్టయ్య తదితరులు. పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యం: హెచ్ఆర్ సమీర్




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూలై 31 (నినాదం):** నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ సంస్థ లక్ష్మణ్ ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ హెచ్ఆర్ సమీర్ అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాలో యుఎన్ఓ మింద నుండి 15 టాటా ఎలక్ట్రానిక్స్ కు10 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎస్వీ కళాశాలలో ఉద్యోగం మేళ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

## పాలేరు డివిజన్ ఆత్మా కమిటి మాజీ చైర్మన్ మృతి..



**పాలేరు జులై 31( నినాదం):**పాలేరు డివిజన్ ఆత్మా కమిటి మాజీ చైర్మన్ జోగుపర్తి వీరభద్రయ్య (85) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు కు కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నేలకొండపల్లి మండలం లోని అనాసాగారం గ్రామానికి చెందిన వీరభద్రయ్య మృతి పట్ల పలువురు సంతాపం ను ప్రకటించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకు లు మృతదేహం ను సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చల కూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర–కార్యదర్శి జెర్రిపోతుల అంజని, మేకల వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి రాజేష్. జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు సంతాపం ప్రకటించారు.

## యూడీఎఫ్ టెండర్లపై అసత్య ఆరోపణలు మానాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నిరాధార విమర్శలు చేస్తే న్యాయపరమైన చర్యలు తప్పవని రవీందర్ సింగ్‌కు బీజేపీ హెచ్చరిక

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు




**కరీంనగర్, జులై 31(నినాదం):**యూడీఎఫ్ నిధులు, అదనపు (ఎక్సెస్) టెండర్ల పేరుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యతా రాహిత్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మండిపడ్డారు. ఆరోపణలు చేసే ముందు బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ సింగ్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యూడీఎఫ్ పథకానికి రూ. 180 కోట్ల పరిపాలనా అనుమతి ఉన్నప్పటికీ, పనుల విలువ రూ. 137 కోట్లేనని తెలిపారు. టెండర్లను రాష్ట్ర ప్రభుత్వమే ఆమోదిస్తుందని, అలాంటప్పుడు రూ. 30 నుంచి రూ. 40 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను అదే నిర్మాణ సంస్థకు అప్పగించారని గుర్తుచేశారు. మిడ్ మానేరు, గౌరవెల్లి, తోటపల్లి, మల్లన్నసాగర్ వంటి ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ పనులు కూడా అదే సంస్థకు అప్పగించిన విషయాన్ని మరిచిపోకూడదన్నారు. అప్పట్లో జరిగిన అదనపు టెండర్లపై సమాధానం చెప్పకుండా ఇప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్‌లో మానేరు రివర్‌ఫ్రంట్‌తో పాటు పలు అభివృద్ధి పనుల్లో కూడా అదనపు టెండర్లు ఉన్నాయని, అవి అప్పటి ప్రభుత్వ నిర్ణయాలేనని పేర్కొన్నారు. అదనపు టెండర్లు అనేవి ప్రభుత్వ సాంకేతిక, పరిపాలనా నిర్ణయాల ప్రకారమే జరుగుతాయని, వాటిని అవినీతిగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. బండి సంజయ్ కుమార్‌కు టెండర్లు, కాంట్రాక్టులతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన సునీల్‌రావు, కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి యూసీఎఫ్ పథకం కింద రూ. 840 కోట్ల నిధులు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ లక్ష్యమని చెప్పారు. బండి సంజయ్‌పై చేసిన ఆరోపణలకు రవీందర్ సింగ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే టెండర్లపై ఎలాంటి విచారణ జరిగినా తమకు అభ్యంతరం లేదని, కానీ నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు వొంటెల సత్యనారాయణ రెడ్డి, వంగల పవన్, బండారి వేణు, కొలిపాక శ్రీనివాస్, పొన్నం మొండయ్యతో పాటు బీజేపీ నాయకులు పండుగ నాగరాజు, వాసు, భాస్కర్, హమీద్, రాజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వండి.. ఫారెస్ట్ ట్రెంచ్ వద్దు

మూకమామిడి గ్రామస్తుల ఆందోళన

ఇళ్ల స్థలాల కోసం నరికిన భూమిలో ఫారెస్ట్ వారు ట్రెంచ్ తవ్వడాన్ని అడ్డుకున్న గ్రామస్తులు, ప్రజా సంఘ నాయకులు



**ములకలపల్లి, జూలై 30(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం మూకమామిడి పంచాయతీ ప్రజలు ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలు కోసం గ్రామస్తులు మూకమామిడి పంచాయతీ సాయిరాంపురం శివారు శివాలయం గుడి దగ్గర నరికిన భూమిలో ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్ తవ్వడాన్ని గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని పేద కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని చాలా కా లంగా డిమాండ్ ఉంది. ఈ క్రమంలో గ్రామస్తులు కొంత భూమిని శుభ్రం చేసి స్థలాల కోసం సిద్ధం చేశారు. కానీ గురువారం కార్పొరేషన్ శాఖ అధికారులు సిబ్బంది వచ్చి ఆ భూమిలో ట్రెంచ్ తవ్వుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇవ్వకుండా ట్రెంచ్ తవ్వడం సరికాదు అని ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. అప్పటి వరకు ఫారెస్ట్ వారు ఇక్కడ పనులు ఆపాలి అని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ప్రజా సంఘ గిరిజన నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామసులకు మద్దతు తెలిపారు. పేదల హక్కుల కోసం పోరాడతా మని హామీ ఇచ్చారు.
అధికారులు పరిస్థితి ని సమీక్షించి ఉన్నతాధికారు లకు నివేదిక పంపాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో గ్రామస్తులు, యువకులు, మహిళ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విద్యార్థుల ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బహిష్కరణకు స్పందన

కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం





**ఎల్బీనగర్, జూలై 31,(నినాదం):**ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బహిష్కరణ చేపట్టారు. ఈ పిలుపునకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు నిర్వహించిన ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు కీలకమని, నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గుజ్జ సత్యం ఆరోపించారు. పెండింగ్ బకాయిల విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ కులాల సమన్వయ వేదిక నేత బొమ్మ రఘురాం, రాష్ట్ర కోఆర్డినేటర్ సల్వా చారి, అశోక్ గంగపుత్ర, మహేష్, రాజేష్ నరేందర్‌తో పాటు విద్యార్థి నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1, 2 తేదీల్లో కరీంనగర్‌లో 6వ బిల్డ్ ఎక్స్‌పో

ఆధునిక నిర్మాణ సాంకేతికత, నాణ్యమైన ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం.

ఏసీసీఈఐ) కరీంనగర్ కేంద్రం ప్రతినిధులు,సంస్థ ఛైర్మన్ నల్ల లక్ష్మయ్య,



**కరీంనగర్, జులై31(నినాదం):**భవన నిర్మాణ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికత, నాణ్యమైన నిర్మాణ ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడానికి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం ఇండోర్ హాల్‌లో ఆగస్టు 1, 2 తేదీల్లో ఆరో బిల్డ్ ఎక్స్‌పో 2026 నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్లు ఇండియా (ఏసీసీఈఐ) కరీంనగర్ కేంద్రం ప్రతినిధులు తెలిపారు. సంస్థ ఛైర్మన్ నల్ల లక్ష్మయ్య, ఎక్స్‌పో కన్వీనర్ పాక పావన కృష్ణ, కార్యదర్శి సబ్బని శ్రీనివాస్, స్పాన్సర్‌షిప్ కమిటీ అధిపతి వేల్పుల శ్రవణ్ శుక్రవారం రోజున అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ,ఆగస్టు 1,2తేదీలలో ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ప్రదర్శన ద్వారా ఇల్లు నిర్మించుకునే వారికి నాణ్యమైన ఉత్పత్తుల ఎంపిక, ఆధునిక నిర్మాణ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన పునాది నుంచి అంతర్గత అలంకరణ వరకు స్టీల్, సిమెంట్, పెయింట్లు, హార్డ్‌వేర్, ప్లైవుడ్, లామినేట్లు, లిఫ్టులు, నీటి నిరోధక రసాయనాలు, విద్యుత్, శానిటరీ సామగ్రి, యూపీవీసీ కిటికీలు, పీటీ స్లాబ్ సాంకేతికత తదితర ఉత్పత్తులను దేశంలోని ప్రముఖ సంస్థలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు సందర్శకులకు ఉచితంగా సలహాలు అందిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎక్స్‌పోకు ప్రవేశం ఉచితమని, సందర్శకులకు లక్కీ కూపన్లు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కో కన్వీనర్లు కోల అన్నారెడ్డి, గడ్డం హరికిషన్, కోశాధికారి వేణుమాధవ్, ప్రతినిధులు అనిల్, ప్రమోద్, రంజిత్ కుమార్, రాజగోపాల్, ప్రశాంత్, జి. వెంకటకిషన్, గొల్లపల్లి వెంకటేష్, ఫణిందర్, జగదీష్, ప్రవీణ్ చారి, పి. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలి: అంజనీదేవి



**వలిగొండ, జూలై 31 (నినాదం):** రైతులు వరి పంటకు బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని పులిగిల్ల రైతువేదికలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉన్నందున ఎల్–నినో వాతావరణ పరిణామాల వల్ల ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వరి పంటలు వేసి భవిష్యత్తులో నష్టపోవద్దని కందులు, పేసర్లు, నువ్వులు, ఉలవలు, మినుములు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపి అధిక లాభాలు పొందాలని, అలాగే సేంద్రియ పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో పంటలను సాగు చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల అనూష, జక్కా జంగారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి క్రాంతి కుమార్, పంచాయతీ కార్యదర్శి సైదులు, రైతులు పైళ్ల మల్లారెడ్డి, సత్తిరెడ్డి, పుల్లారెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

రేషన్ కార్డుల ఈ కేవైసీ – తేదీ పొడిగింపు

జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద



**వెల్దుర్తి, జూలై 31(నినాదం):** మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులకు తెలియ జేయునది ఏమనగా, ప్రభుత్వం ఆగస్టు, సెప్టెం ఓబర్ మరి యు అక్టోబర్–2026 నెలల కు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేస్తున్నది.
కావున ప్రతి రేషన్ కార్డు దారుడు 01.08.2026 నుండి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాప్‌కు వెళ్లి మూడు నెలల బియ్యం కోటాను తప్పనిసరిగా పొందవలె ను. అదేవిధంగా, రేషన్ కార్డులోని ప్రతి సభ్యునికి 31.08.2026 లోపు వ–ఖ్‌జ పూర్తి చేయించుకోవాలి. చిన్నారుల ఈబికేవైసీ ను ఐరిస్ డివైస్ ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చు. మూడు నెలల బియ్యం కోటాను సకాలంలో పొందడంతో పాటు, కుటుంబ సభ్యులందరి ఈ బి కేవైసీ ను తప్ప నిసరిగా పూర్తి చేయించుకొని ప్రభుత్వ సేవలను నిరంతరంగా పొందగలరు. మెదక్ జిల్లా పరిధిలోని అన్ని ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్లకు ముఖ్య సూచనలు మెదక్ జిల్లా పరిధిలోని అన్ని ఎఫ్ పి ఎస్ , డీలర్లు 01.08.2026 నుండి షాపులను నిర్ణీత సమయానికి తెరిచి, లబ్ధిదారులకు ఆగస్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్––2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పంపిణీ చేయవలెను. అలాగే, మీ షాపు పరిధిలో ఈబికేవైసీ పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి వ్యక్తిగతంగా సమాచారం అందించి, 31.08.20 26 లోపు 100% ఈ బి కేవైసీ పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారుల ఈబికేవైసీ ను ఐరిస్ డివైస్ ద్వారా పూర్తి చేయించాలి. ప్రతి గ్రామంలో చాటింపు (మైక్ అనౌన్స్‌మెంట్) ద్వారా మూడు నెలల బియ్యం పంపిణీ మరియు ఈబికేవైసీ పూర్తి చేయవలసిన విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలి. ప్రతి రోజు ఈబికేవైసీ పురోగతి మరియు బియ్యం పంపిణీని సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించవలెను అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం దిగ్భ్రాంతకరం

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, జులై 31 (నినాదం):** తెలంగాణ ఉద్యమంలో అంకితభావంతో పనిచేసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని, ఉద్యమాన్ని నడిపించి ఎదిగివచ్చిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిమరణం తీవ్రంగా కలచివేసిందని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. కేసీఆ ర్ కు అత్యంత సన్నిహితుడుగా, నాకు వ్యక్తిగతంగా ఎంతో ఆత్మీయుడుగా ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి, తెలంగాణకు తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, వారి ఆత్మకు భగవంతుడు ప్రశాంతత చేకూర్చాలని, వారి కుటుం బానికి మనోధైర్యం అందించాలని ఆకాంక్షించారు

## డబ్బాలను తొలగించి చిరు వ్యాపారస్తుల జీవనోపాధిని దెబ్బతీసిన పాలకవర్గం

బీఎస్పీ మక్తల్ అసెంబ్లీ ఇన్చార్జి అశోక్ కుమార్



**అమరచింత, జూలై 31, (నినా దం ):** ఆత్మ కూరు మున్సిపాలి టీ కేంద్రం లోని ఎంపీ డీవో కార్యాల యం నుండి మార్కెట్ యార్డ్ వరకు గత కొన్ని సంవత్సరాలు గా డబ్బా లు వేసు ఒకొని జీవనోపాధి చేసుకుంటున్న చిరు వ్యాపారస్తుల డబ్బాలను తొలగించి మున్సి పల్ పాలకవర్గం వారి జీవనోపాధిని దెబ్బతీ సిందని బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ ఇన్చార్జి అశోక్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆత్మకూరులో ఆయన మాట్లాడు తూ దాదాపు కొన్ని సంవత్సరాలుగా అక్కడే జీవనోపాధి పొం దుతున్న చిరు వ్యాపారస్తుల డబ్బాలను గత 5 నెలల క్రితం రోడ్డు విస్తరణ పేరుతో అందరినీ ఖాళీ చేయించారని మండి పడ్డారు. దీంతో చిరు వ్యాపారస్తులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని దీనికి మున్సిపాలిటీ పాలకవర్గమే కారణమని ఆరోపించారు. జీవనోపాధిని కోల్పోయిన వారికి కనీసం ప్రత్యావ న్నాయ ఏర్పాట్లు చూడకుండా నిర్లక్ష్యం వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బాలను తొలగించిన పాలకవర్గమే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదా తొలగించిన స్థానంలోనే రోడ్డు విస్తరణ అయ్యేవం–కు డబ్బాలను అక్కడే ఉంచేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆలోచనలు ముందుకు తీసుకెళ్దాం



ంంంండాక్టర్ విశారదన్ మహరాజ్ ఆశయాలు, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకుడు దూడ పోచారాజు కృషి చేస్తున్నారు. బుగ్గారం మండల కేంద్రంలో ప్రజలను చైతన్యపరుస్తూ, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం తన వంతు కృషి చేస్తున్నారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ చూపిన బాటలో నడుస్తూ, ఆయన ఆలోచనలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా దూడ పోచారాజు ముందుకు సాగుతున్నారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలని, ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొంటున్నారు. బుగ్గారం మండలంలో ధర్మ సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే, సామాజిక మార్పు కోసం ప్రజలను ఏకం చేసే దిశగా దూడ పోచారాజు చేస్తున్న ప్రయత్నాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

శనివారం । తెలంగాణ
1 ఆగస్టు 2026

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, మెచ్చా!



**దమ్మపేట, జూలై 31(నినాదం):** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మృతి పట్ల సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సండ్ర వెంకట వీరయ్య, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం నర్సంపేట నియోజకవర్గంలో జరిగిన పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రలో వారు స్వయంగా పాల్గొని, ఆయన పార్థివ దేహానికి అశ్రునయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిన విశేష సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి మరియు బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## ఏల రాము రామానుజాచార్యకు... పురోహిత అర్చక రత్న బిరుదుతో ఘన సత్కారం




**కుత్బుల్లాపూర్, జులై 31 (నినాదం) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని చింతల్ పురోహితుడు ఏల రాము రామానుజాచార్యకు అరుదైన పురోహిత అర్చక రత్న బిరుదుతో ఘన సత్కారం లభించింది. అఖిల భారత పద్మ బ్రాహ్మణ సంఘం 28వ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల తమిళనాడు లోని శ్రీరంగంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గిరి గుట్ట చింతల్ ద్వారకానగర్ కు చెందిన ప్రముఖ పురోహితుడు ఏల. రాము రామానుజాచార్యకు ఆయన అందిస్తున్న విశిష్టమైన పౌరోహిత, ఆధ్యాత్మిక సేవలను గుర్తించి పురోహిత అర్చక రత్న బిరుదుతో సత్కరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా హాజరైన అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం జాతీయ అధ్యక్షులు గుర్రం బొజ్జయ్య శాస్త్రి, తెలంగాణ రాష్ట్ర అధ్య క్షులు రుద్ర పాండు శాస్త్రి, ప్రముఖ పండితులు సీత వంశీ భట్టాచార్యులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాము రామానుజాచార్యులు ఎన్నో సంవత్సరా లుగా పౌరోహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తూ, ధార్మిక విలువ లను సమాజంలో పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీ యమని కొనియాడారు. ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల కుటుంబ సభ్యులు, శిష్యులు, భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ రాము రామానుజాచార్యులకు అభినందనలు తెలిపారు.

## కూలిన ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో



**ధర్మారం జులై 31 ( నినాదం):**మండలంలోని చామనపల్లి గ్రామంలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి కొన్ని ఇల్లు పాక్షికంగా కూలిపోయాయి. అట్టి ఇళ్లను ఈరోజు మండల అభివృద్ధి అధికారి వేముల సుమలత సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు తో కలిసి గ్రామంలో పర్యటించి, ప్రభుత్వ పరంగా సహాయాన్ని అందించడానికి ప్రయత్నం చేస్తామని వారికి మనోధైర్యాన్ని నింపారు. అత్యవసర సమయంలో పునరావసం కల్పించిన సర్పంచ్ రేవతి నాగరాజుకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను గోడలను పరిశీలించి వాటి వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ జిపిఓ ఎల్లయ్య కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దనట్టుపై అఖిల పక్ష సమావేశం

జీవో 99ను వ్యతిరేకిస్తూ తీర్మానం

రానున్న రోజుల్లో ఉధృతంగా పోరాటం



**చిన్నంబావి, జూలై 31(నినాదం):** చిన్నంబావి మండల కేంద్రంలో కొప్పునూర్ గ్రామ పెద్దనట్టు భూమి 116 ఎకరాలపై ఆయా పార్టీలతో అఖిలపక్ష సమావేశం శుక్రవారం సునీత పంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ కొప్పునూరు గ్రామ ప్రజలకు చెందిన 116 ఎకరాల భూమి పై ఇటీవల రాష్ట ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 99 ను పూర్తి స్థాయిలోవ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మంత్రికి 99 జీవోపై ఉన్న శ్రద్ధ 98 జీవోపై లేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజక వర్గంలో కాని, మండలంలోచేసిన అభివృద్ధి ఏమిటో స్పష్టంగా చెప్పాలని నాయకులు డిమాండ్చేశారు. కొప్పునూర్ గ్రామానికి చెందిన ప్రజలు పశువులు, గొర్రెల పశుగ్రాసంకోసం ముందు చూపుతో 116 ఎకరాలను గతంలోనే కొనుగోలు చేశారని, ఆ పెద్దనట్టు భూమిపై ప్రజా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదని అన్నారు. జీవో 99 తక్షణమే రద్దుకు మంత్రి జూపల్లి కృష్ణారావు చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జడ్పీటీసీ వెంకట్రావమ్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాగ్గరి శ్రీధర్ రెడ్డి,పార్టీ అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, చిన్న మల్లయ్య, వెంకట్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, రమేష్, వెంకటేష్, గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు నంది నిరంజన్ రెడ్డి, కానుగల రాజు, మహేశ్వర్ రెడ్డి, తగరం కురుమయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

# గ్రామీణ ప్రగతే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం

దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన...

అంగన్‌వాడీ కేంద్రాలు, అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ...

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత...







**దమ్మపేట, జూలై 31(నినాదం):**గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించడమే నా ప్రథమ కర్తవ్యం" అని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం దమ్మపేట మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, అధికారులకు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు:**

పర్యటనలో భాగంగా జగ్గారం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిశలగూడెం, జగ్గారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు మెరుగైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం శ్రీరాంపురంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను, వాటి నాణ్యతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని, ఎక్కడా అలసత్వం వహించినా, నాణ్యత లోపించినా కఠిన చర్యలు ఉంటాయని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మొండివర్రె గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవన పనులను, పాత చీపురు గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వీఓ భవనాన్ని ఆయన పరిశీలించారు. విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ నాగుపల్లి ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను తనిఖీ చేసి, పనులు వేగవంతం చేయాలన్నారు. మల్కారం పంచా యతీ పరిధిలోని గుత్తావారిగూడెంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు.

**బాధిత కుటుంబానికి అండగా..**

పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ శ్రీరాంపురం గ్రామానికి చెందిన బోగి సారధకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఎమ్మెల్యే ఆదినారాయణ లబ్ధిదారునికి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం అందుబా టులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మద్దిశేటి సత్యప్రసాద్, జిల్లా నాయకులు వాసం శ్రీను, మాజీ సర్పంచ్ మడకం రాజేష్, సర్పంచ్ లు వంక జానికి రాముడు, మోకాళ్ళ గురిమూర్తి, కే రాజశేఖర్, నాగుపల్లి ఉప సర్పంచ్ కుంపటి వేణు, మారప్పగూడెం సర్పంచ్ పూనెం వెంకటేశ్వర రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్, పీఆర్ డీఈ శ్రీధర్, పిఆర్ ఏఈ ఝుంకీలాల్, మరియు ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై సమరం.. సీఐటీయూ..!

ఆగస్టు 10న "జైల్ భరో " ను విజయవంతం చేయండి! పిట్టల అర్జున్ పిలుపు..




**దమ్మపేట, జూలై 31(నినాదం):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించబోయే 'జైల్ భరో' (ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా లింగాలపల్లి, తాటిమల్లమ్మ గుంపు, మల్కారం, దమ్మపేట, మందలపల్లి గ్రామాల్లో ప్రచారం ముమ్మరంగా చేపట్టి అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. దేశంలో స్కీం వర్కర్లు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలకు అందుతున్న కొద్దిపాటి సబ్సిడీలను కూడా కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తోందని మండిపడ్డారు. బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు మాత్రం విచ్చలవిడిగా రాయితీలు ఇస్తోందని, ఇలాంటి ప్రభుత్వానికి పరిపాలించే అర్హత లేదని విమర్శించారు. నాడు 'క్విట్ ఇండియా' నినాదంతో తెల్లదొరలను వెళ్లగొట్టి 86 సంవత్సరాలు నిండిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే ఈ పోరాటంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, వజ్రమ్మ, సరోజినీ, భద్రమ్మ, కృప, తిరుపతమ్మ, చిట్టెమ్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల ఇల్లు కూల్చివేత నిరసిస్తూ...

# నేడు అంబేద్కర్ మనవడు ఖమ్మం రాక




**ఖమ్మం, జులై 31(నినాదం ):**కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన ఆగస్టు 1న జరగబోవు నిరసన ర్యాలీ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకండి రాంబాబు మాట్లాడుతూ వెలుగుమట్ల పేద ప్రజల ఇల్లు కూల్చడం దుర్మార్గపు చర్య దాని ఖండిస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ విశారదన్ మహరాజ్ నేతృత్వంలో మహా ధర్నా అమర నిరాహార దీక్షల ఫలితంగా వెలుగుమట్లలోనే ప్రభుత్వం 311 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం మిగతా 500 మందికి ఆయా కారణాల చేత వారికి ఇవ్వకపోవడం వారికి ఇవ్వాలని జరిగిన సుదీర్ఘ పోరాట ఫలితంగా వారికి కూడా ఇస్తామని ముందుకు రావడం కానీ వెలుగుమటలు కాకుండా వేరే ప్రాంతంలో ఇవ్వటాన్ని నిరసిస్తూ వెలుగు మట్లలోనే వారికి కూడా ఇల్లు ఇవ్వాలని ఆగస్టు ఒకటి మధ్యాహ్నం 12 గంటలకు జడ్పీ సెంటర్ వరకు వెలుగుమట్ల బాధితులతో భారీ నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నాము అని అన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడు భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ , మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ , బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ మరియు ఎందరో ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు . కనుక ప్రజాతంత్ర అభ్యుదయ మానవతావాదులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు . బాధితురాలు సుమలత మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే వెలుగుమట్లలో ఇల్లు ప్రకటించకపోతే రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని ఆమె అన్నారు . ఈ కార్యక్రమంలో వెలుగుమట్ల బాధితులు వట్టె ఉదయ్ , ఎండీ అమిత్ , మట్ట నవ్య , మౌనిక , పోలూరి రాము , శివరాత్రి కృష్ణ , బుజ్జి నరసింహారావు , హసీనా , డి. రాము , వేముల కోటేశ్వరరావు , ఖదీర్ పాషా తదిరులు పాల్గొన్నారు

## పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో యాదాద్రి జిల్లా నిరుద్యోగ యువతకు అన్యాయం: ఏఐవైఎఫ్

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందం



**మోటకొండూరు: జూలై 31(నినాదం):**రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన ఖాళీలను చూపించకపోవడం వల్ల జిల్లా నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ ఆరోపించారు. మోటకొండూరు మండల ఏఐవైఎఫ్ నిర్మాణ మహాసభ బీరకాయల మధు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేందర్ మాట్లాడుతూ, జూలై 29న విడుదలైన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో కోడ్ నంబర్-21(సివిల్ కానిస్టేబుల్), కోడ్ నంబర్-22(ఏఆర్ కానిస్టేబుల్)పోస్టుల జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఒక్క ఖాళీ కూడా కేటాయించకపోవడం పట్ల నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. 2021 డిసెంబర్‌లో జారీ చేసిన జీవో-317 ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉండగా,నల్లగొండ,సూర్యాపేట తదితర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లను యాదాద్రి జిల్లాకు కేటాయించారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుంచి వేరు చేసినప్పటికీ,ఇతర జిల్లాలకు చెందిన సిబ్బందిని వారి స్థానిక కేడర్లకు బదిలీ చేయలేదన్నారు. దీనివల్ల యాదాద్రి జిల్లాలో ఖాళీలు లేకుండా పోయి, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయని విమర్శించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లను వెంటనే వారి సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేసి, వాస్తవిక ఖాళీలను గుర్తించి సవరించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్ 8,9, 10వ తేదీలలో యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు, యువజన ప్రదర్శనను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ,దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర కీలకమని అన్నారు. యువతలో ప్రగతిశీల, ప్రజాస్వామిక,లౌకిక,దేశభక్తి విలువలను పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి,యువతపై జరిగిన లాఠీచార్జిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్ 8న యాదగిరిగుట్టలో నిర్వహించే యువజన ప్రదర్శన,బహిరంగ సభను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం మోటకొండూరు మండల ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీరకాయల మధు, ప్రధాన కార్యదర్శిగా గొట్టిపాముల సునీల్ కుమార్,సహాయ కార్యదర్శిగా దేవళ్ల కృష్ణ,కోశాధికారిగా పల్లె ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం,సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజ్,ఏఐవైఎఫ్ నాయకులు ఆలేటి సాయి కుమార్, రేగు పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య.. ముల్కనూర్‌లో విషాదం

**భీమదేవరపల్లి జూలై 31 (నినాదం):**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం.

## సందె రామలింగం మృతి బాధాకరం



**చింతపల్లి, జూలై 31(నినాదం) :**మండలంలోని తీదేడు గ్రామానికి చెందిన సందె రామలింగం మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆ గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. మృతుడు సందె రామలింగం మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రామలింగం కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం తన వంతు బాధ్యతగా కుటుంబ సభ్యులకు రూ. 5,000 (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందె మల్లమ్మ నీరంజన్, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, సందె లక్ష్మయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మద్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, మద్రు శ్రీనివాసరావు, దాసరి తిరుపతయ్య, జూలూరి శ్రీధర్, మొరుపోజు రాజు, గంటెల ఆంజనేయులు, సందె యేసు, సందె దేవయ్య, మునగాల అశోక్, మల్లిగారి యాదయ్య, మల్లిగారి అనిల్, వంకేశ్వరం శ్రీను, గడ్డం అంజయ్య తదితరులు పాల్గొని రామ లింగం మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు

## రెండు కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



**కోదాడ, జులై 31 (నినాదం):**కోదాడ పట్టణ పోలీసులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, పల్సర్ బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కోదాడకు చెందిన అవిడి రాఘవ, పంది వినోద్‌లు అల్వాలపురానికి చెందిన మద్దే రవితేజ వద్ద గంజాయి కొనుగోలు చేసి, కొంత విక్రయించి మిగిలినదాన్ని విక్రయానికి సిద్ధం చేస్తుండగా దుర్గాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఖమ్మం బైపాస్ వద్ద మామిడి తోటలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ప్రధాన నిందితుడు మద్దే రవితేజ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టౌన్ సీఐ శివశంకర్, ఎస్సై అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మన చంద్ర ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు.

చైర్మన్ డాక్టర్. ఏ చంద్రప్రియ




**వికారాబాద్, జూలై 31(నినాదం ):** మన చంద్ర ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో నిరుపేదలైన మహిళలకు నిరుపేదలకు, గర్భిణీ స్త్రీ, విద్యార్థులకు, ఉచిత వైద్య శిబిరాలు, వంటి సేవా కార్యక్రమాలకు నిర్వహిస్తామని, మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చంద్రప్రియ అన్నారు. శుక్రవారం మోరంగ్ పల్లి గ్రామంలో అంబేద్కర్ పూలమాల వేసి, అనంతరం పులిగారి వెంకటయ్య ఆధ్వర్యంలో యువకులు గ్రామ పెద్దలు, చంద్రప్రియను, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలకు మహిళలకు, రోగులకు, గర్భిణీలకు, విద్యార్థులకు అవసరమైనటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని, చెప్పారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ కూతురుగా నియోజకవర్గ పరిధిలోని గ్రామ గ్రామాన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం సేవ ఫౌండేషన్ సభ్యులు, బుధరపు బుచ్చిరెడ్డి, పులిగారి వెంకటయ్య, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వేతన శ్రేణి కోసం ఉద్యోగుల ఆందోళన..

పెన్‌డౌన్, విధుల బహిష్కరణ ప్రారంభం

**మెట్ పల్లి జూలై 31( నినాదం):**వేతన శ్రేణి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు శుక్రవారం నుంచి పెన్‌డౌన్, విధుల బహిష్కరణ ఆందోళన చేపట్టారు. రాష్ట్ర సంయుక్త చర్యా కమిటీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని ఉద్యోగులు విధులకు దూరంగా ఉంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం అమలులో గ్రామస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నప్పటికీ, తమకు ఇప్పటికీ వేతన శ్రేణి లేకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నిరంతర సేవలందిస్తున్న తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిశీలించి వేతన శ్రేణి మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రాష్ట్ర సంయుక్త చర్యా కమిటీ ఆదేశాల మేరకు శాంతియుతంగా పెన్‌డౌన్, విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మా సేవలకు గుర్తింపు ఇవ్వాలి.. మా హక్కుగా వేతన శ్రేణి కల్పించాలి,



శనివారం, తెలంగాణ
1 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

### లింగన్న ఆశయాల సాధనకు
## పోరాటమే నిజమైన నివాళి
లింగన్న 7వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పిలుపు..



**గుండాల, జూలై 31 (నినాదం):** లింగన్న చూపిన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ముక్తి సత్యం, కోరం సీతారాములు పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాల మండలంలోని రోళ్లగడ్డ గ్రామంలో లింగన్న 7వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ భూమి,భుక్తి,పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా నూతన ప్రజాతంత్ర విప్లవ పోరాట బాటలో లింగన్న ఇల్లందు ఏజెన్సీ ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ముఖ్యంగా గిరిజనులు, ఇతర పేదలకు పోడు భూముల హక్కుల సాధన కోసం లింగన్న శక్తివంచన లేకుండా పోరాడారని, ఆయన ఉద్యమాల ఫలితంగానే ఈ ప్రాంతంలోని అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. లింగన్న చూపిన మార్గంలో ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం లాలయ్య, యాసారపు వెంకన్న, పెండేకట్ల పెంటయ్య, పరిశిక రవి, మానాల ఉపేందర్, ఈసం కృష్ణ, తాటి రమేష్, పాయం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భరత్ నగర్ మట్టి రోడ్లకు మొరం..
## ప్రజల రాకపోకలకు ఊరట



**గద్వాల ప్రతినిధి జులై 31 (నినాదం):** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ ఆదేశాల మేరకు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు సూచనలతో 8వ వార్డు భరత్ నగర్ కాలనీలో మట్టి రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు .కాలనీలోని పలు ప్రాంతాల్లో మట్టి రోడ్లు గుంతలుగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల కారణంగా రోడ్లు మరింత దెబ్బతినడంతో సమస్యను స్థానికులు మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపాలిటీ అధికారులు ట్రాక్టర్ల ద్వారా మొరం తరలించి, దెబ్బతిన్న రోడ్లపై వేయించారు. అనంతరం డోజర్ తో రోడ్లను చదును చేసి ప్రజల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దే పనులు నిర్వహించారు. రోడ్ల మరమ్మతు పనులు చేపట్టడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి అభివృద్ధి పనులు చేపడుతున్న మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపాలిటీ అధికారులను వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

## ప్రతి ఒక్కరు భారతమాత రక్షణ కోసం
## దేశ సమైక్యత కోసం పాటుపడాలి
టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోతంగల్ రామ్ కిషన్ రావు



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 31 (నినాదం) :** కుల మతాలకతీతంగా ప్రపంచానికే తలమానికంగా నిలిచిన ప్రజాస్వామ్య దేశం భారతదేశమని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోతంగల్ రామ్ కిషన్ రావు అన్నారు. ప్రతి ఒక్కరు భారతమాత రక్షణ కోసం దేశ సమైక్యత కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్ సిద్దయ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తి చాటి చెప్పేలా మానసిక దివ్యాంగ విద్యార్థులతో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోతంగల్ రామ్ కిషన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతంగల్ రామ్ కిషన్ రావ్ మాట్లాడుతూ వందేమాతరం పార్లమెంట్ లో నీటి రోజు నేటి రోజు ఆమోదించిన రోజన్నారు.. కుల మత వర్గ విభేదాలు లేకుండా 140 కోట్ల మందితో భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు.. దేశ రక్షణ కోసం వివిధ దేశాల నుండి ఎలాంటి ప్రమాదాలు రాకుండా ఉండేందుకు మైనస్ డిగ్రీ సెంటీగ్రేడ్ లలో భారత సైనికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కాపాడుతున్నారని తెలిపారు.. భారతమాత రక్షణ, దేశసమైక్యతను చాటి చెప్పే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని సూచించారు.. ఈ ర్యాలీ పురవీధుల గుండా కొనసాగించి పలువురు పెద్దలకు జాతీయ జెండాను అందించి దేశ సమైక్యతను దేశ గొప్పతనాన్ని మానసిక అంధ విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, అందుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## గురువుకు ఘన సన్మానం...
పదవీ విరమణ సందర్భంగా జగ్గాసాగర్‌లో సత్కార కార్యక్రమం

**మెట్‌పల్లి, జూలై 31: (నినాదం):** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ప్రభాకర్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం గ్రామంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొని ప్రభాకర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికగా చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సర్పంచ్ పుల్ల సాయగౌడ్, విద్యా రంగంలో ప్రభాకర్ అందించిన సేవలను ప్రస్తావిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా తన అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొని ప్రభాకర్‌కు అభినందనలు తెలియజేశారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ సత్కరించారు.



## సర్ ప్రక్రియపై నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే కోరం కనకయ్య
గడువు ముందే పూర్తి చేయాలి





**ఇల్లందు, జూలై 31(నినాదం ):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని రాజస్థాన్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) ప్రక్రియపై ఐదు మండలాల అఖిలపక్ష పార్టీల నేతలతో అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సర్ పై ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రతి ఓటు కీలకమైనని ఒక్క ఓటు కూడా రద్దు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు బిఎల్ఏలు, బిఎల్ఓ వాళ్ళు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**అధికారులతో సమీక్ష...**

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియ పురోగతిని మండలాల వారీగా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ఇంకా పూర్తి కాని ఎన్యుమరేషన్ ఫారాలను త్వరితగతిన పూర్తి చేసి సర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు ఎన్యుమరేషన్ ఫారాల పూర్తి ప్రక్రియలో అధికారులకు పూర్తి సహకారం అందిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం, మండల అధ్యక్షుడు రాంమహేష్, కామేపల్లి, గార్ల, టేకులపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ గౌడ్, లక్కినేని శ్యాంబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేతనాల్లో కోతలు.. బీడీ కార్మికుల ఆవేదన
ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి...



**మెట్ పల్లి, జూలై 31: ( నినాదం):** మెట్‌పల్లి మండలంలోని శివాజీ బీడీ కంపెనీకి చెందిన కొందరు బీడీ కార్మికులు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రోజంతా శ్రమించి వేలాది బీడీలు తయారు చేస్తున్నప్పటికీ, తమ శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 1000 బీడీలకు రూ. 275. 23 వేతనం నిర్ణయించినప్పటికీ, తమకు రూ. 270 నుంచి రూ. 273 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని కార్మికులు పేర్కొన్నారు. ప్రతి నెలా వివిధ కారణాలు చూపుతూ బీడీలపై కోతలు విధించడం వల్ల ఇప్పటికే స్వల్పంగా ఉన్న ఆదాయం మరింత తగ్గిపోతోందని తెలిపారు. బీడీల తయారీకి అందించే తునికి ఆకు నాణ్యత సరిగా లేకపోవడంతో పని చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దాని ప్రభావం కూడా తమపైనే పడుతోందని పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల మధ్య ఈ తక్కువ ఆదాయంతో జీవనం మరింత భారంగా మారిందని కార్మికులు వాపోయారు. దశాబ్దాలుగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న తమలాంటి కార్మికుల సమస్యలను ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి, ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు పూర్తిగా అమలు చేయడంతో పాటు అన్యాయమైన కోతలను అరికట్టాలని, నాణ్యమైన ముడిసరుకు అందేలా చర్యలు తీసుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

## వడ్డెరులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలి
జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు ఫీట్ల శ్రీధర్



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 31 (నినాదం) :** వడ్డెరులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు ఫీట్ల శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన జాతీయ వడ్డెర సంఘం నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సులో జాతీయ అధ్యక్షులు ఫీట్ల శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర సమాజం నేటికీ సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ రంగాల్లో అనేక వెనుకబాటుతనాలను ఎదుర్కొంటోందని అన్నారు. ఈ పరిస్థితులను అధిగమించి సమాజ అభివృద్ధిని సాధించాలంటే వడ్డెర ప్రజలు సంఘటితమై హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. జాతీయ వడ్డెర సంఘం జాతీయ సలహాదారు దండి వెంకట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్ మాట్లాడుతూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారతదేశ నిర్మాణం, అభివృద్ధిలో వడ్డెర ప్రజలు చారిత్రకంగా విశేష సేవలు అందించినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సేవలను తగిన విధంగా గుర్తించలేదని అన్నారు. వడ్డెర సమాజ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, విద్య, ఉపాధి, భూమి, గృహాలు, సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి వంటి రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ రంగంలో వడ్డెర సమాజానికి తగిన ప్రాతినిధ్యం కల్పించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. వడ్డెర యువత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో ముందుండాలని, మహిళలు కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా వడ్డెర సమాజ హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సంఘాలను బలోపేతం చేసి రాజ్యాంగబద్ధమైన, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాల ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించేందుకు ప్రతి వడ్డెర కుటుంబం భాగస్వామ్యం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు పల్లపు మహేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు ఎత్తరి రాములు, జిల్లా అధ్యక్షులు ఆర్. నర్సింహులు, ప్రధాన కార్యదర్శి భక్తుల శంకర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా ఎల్లయ్య,శంకర్,నిజామాబాద్ జిల్లా నాయకులు వేముల రవి, పీట్ల శ్రీనివాస్, డి. రాజు, జి. రాజన్న, రెండు జిల్లాలకు చెందిన వడ్డెర సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోనాల సంబురాల్లో శ్రీభారతి స్కూల్



బోనాలతో ఊరేగింపు.. మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు
కోలాటాలు, పోతరాజు, పులి వేషాలతో అలరించిన విద్యార్థులు

**మెట్ పల్లి, జూలై 31:(నినాదం):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మెట్‌పల్లి పట్టణంలోని శ్రీభారతి స్కూల్ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ కంతం రమేష్, డైరెక్టర్ కంతం శివచరణ్, ప్రిన్సిపల్ ఇందూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినీలు సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేశారు. డప్పుల చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ బోనాలతో ఊరేగింపుగా స్థానిక మహాలక్ష్మి ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. విద్యార్థులు ప్రదర్శించిన కోలాటాలు, పోతరాజు వేషధారణలు, పులి వేషాలు, జానపద నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంతం రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగను విద్యార్థులతో కలిసి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలంగాణ సంప్రదాయాలపై అవగాహన పెరగడంతో పాటు సామాజిక విలువలు, నాయకత్వ లక్షణాలు, బృందస్ఫూర్తి వంటి గుణాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కంతం భారతి, కంతం శివచరణ్, అజయ్, పుప్పాల హేమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి
కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేస్తాం
సీపీఎం నాయకులు భూక్య పాండు నాయక్, మాలోతు బాలు నాయక్



**హుజూర్నగర్ (మఠంపల్లి) జులై 31 (నినాదం):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, రైతు, కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య పాండు నాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలు నాయక్ పిలుపునిచ్చారు. మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశం అనంతరం జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలు గ్రామీణ పేదల పని హక్కును కాలరాస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ బాధ్యతలను రాష్ట్రాలపైకి నెట్టివేస్తూ కోట్లాది గ్రామీణ పేదలను నిరుద్యోగంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి కనీసం 200 రోజుల ఉపాధికి చట్టబద్ధ హామీ, జీవనానికి సరిపడే వేతనం, సకాలంలో కూలి చెల్లింపు, పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆహార భద్రతపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను నిలిపివేసి, ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికంగా అమలు చేసి ప్రతి కుటుంబానికి బియ్యం, గోధుమలు, పప్పులు, వంటనూనె, చక్కెర, ఉప్పు తదితర నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జాల తిరుపతయ్య, పొడిచెట్టు రాము, కె. వెంకటేశ్వర్లు, ఆర్. వినోద్ నాయక్, బానోతు చీనా, కె. కోటయ్య, నాగరాజు, బి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఊరపండుగ ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 31 (నినాదం) :** ఇందూరు నగర ఊర పండుగను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించనున్న శోభాయాత్ర ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా నగరంలో ఊర పండుగ సందర్భంగా ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహాల తయారీ కేంద్రాలను, సంబంధిత రహదారులను కమిషనర్ సందర్శించారు. కళాకారులతో మాట్లాడి విగ్రహాల తయారీ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించే మార్గాన్ని పరిశీలిస్తూ భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, ప్రజల రాకపోకల నిర్వహణపై అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. తదనంతరం సిర్నపల్లి గడికి చేరుకున్న పోలీస్ కమిషనర్ అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వసమాజ సమితి సభ్యులతో సమావేశమై ఊర పండుగ నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, శాంతిభద్రతల అంశాలపై చర్చించారు. ఊరపండుగను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, 1వ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి, రూరల్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్, 4వ టౌన్ఎస్‌హెచ్‌ఓ సతీష్, టూ టౌన్ ఎస్ఐ యాదగిరి గౌడ్, సర్వసమాజ్ కన్వీనర్ రామర్థి గంగాధర్, కార్యదర్శి బంటు రాజేశ్వర్, కార్పొరేటర్ మల్కాయి మహేంధర్, కిసాన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొరడి కిరణ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో
## భక్తి పాటలు ఆడియో రిలీజ్
ఆవిష్కరించిన కౌన్సిలర్ మాదినేని సునీత



**వైరా జూలై 31 (నినాదం ):** వైరా లోని సాయి నగర్ లో వున్న స్థానిక సాయిబాబా మందిరం లో చెరుకుపల్లి భక్తి గీతాల రాగ సాగరం భక్తి పాటలను 12 వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కౌన్సిలర్ మాదినేని సునీతఆవిష్కరణ చేశారు. గత 15 సంవత్సరాలుగా వివిధ రకాల భక్తి పాటలు భక్తి గీతాలను ఆలపిస్తూ భక్తులును ఆకట్టుకున్న చెరుకుమల్లి వెంకటేశ్వరరావు భక్తి గీతాలు ఆడియో మొదటి గీతాన్ని ఆవిష్కరించటం సంతోష దాయకమని ఆమె తెలిపారు. సాయిబాబా మంది రం లో ప్రతి ముఖ్య మైన కార్యక్రమాలలో ఆయన భక్తి పాటల తో రసరంజకంగా భక్తులను పరవశింప చేశారని అన్నారు. మొదటి పాట ను యూ ట్యూబ్ లో ఉంచారని భక్తులు ఛానల్ ను ఫాలో అయి వారికి ఇంకా మరిన్ని భక్తి పాటలు పాడేందుకు సహకరించి ప్రోత్సాహం అందిచాలని సునీత కోరారు. ఆడియో విడుదల చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నూకల అన్నపూర్ణ,చె రుకుమ ల్లినిర్మల, గాయకుడు చెరుకుమల్లి వెంకటేశ్వర్లు డాన్స్ మాస్టర్ పి. వి. నటరాజన్ మరియు డాన్స్ మాస్టర్ మహేష్ కుమార్, హేమ ప్రసాద్, భక్తబృందం పాల్గొన్నారు.

## బస్వాపూర్ మహంకాళి ఉత్సవాలకు
## షబ్బీర్ అలీకి ఆహ్వానం



**భిక్కనూర్, జూలై 31 (నినాదం):** భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిర్వహించనున్న ఊర పండుగ, శ్రీ మహంకాళి మాత ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని బస్వాపూర్ కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని షబ్బీర్ అలీ నివాసంలో ఆయనను, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక వేడుకలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. గ్రామంలో సామరస్య వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాగారెడ్డి, ప్రదీప్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం। తెలంగాణ
1 ఆగస్టు 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# తెలంగాణ ఉద్యమ యోధుడికి అశ్రునివాళి

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదం.. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, ఉద్యమ సహచరులు**
**నర్సంపేట-నల్లబెల్లిలో భావోద్వేగాల నడుమ అంతిమయాత్ర.. ప్రముఖ నాయకుల నివాళులు.**





**నల్లబెల్లి, జూలై 31 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రెండు దశాబ్దాలకుపైగా అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ యోధుడు, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇక లేరు. గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారంతెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజా నాయకుడిని చివరిసారిగా చూసేందుకు వేలాది మంది అభిమానులు, రైతులు, మహిళలు, యువకులు, ఉద్యమ సహచరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి అశ్రునివాళులుఅర్పించారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి రాజకీయ నాయకుడికంటే ముందు ఉద్యమకారుడు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ప్రతి కీలక ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యపరిచిన నాయకుడిగా, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతి ఇంటికీ చేర్చిన ఉద్యమ యోధుడిగా గుర్తింపు పొందారు. అధికారాన్ని లక్ష్యంగా కాకుండా ఉద్యమ విజయాన్నే ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగిన ఆయన వేలాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ వరకు రాజకీయ ప్రస్థానం
దుగ్గొండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సుదర్శన్ రెడ్డి, జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ పిలుపు మేరకు బిఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఉద్యమంలో ముందుండి పాల్గొంటూ పార్టీ విస్తరణకు కృషి చేశారు. జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఉద్యమంలో ఎన్నో త్యాగాలు
తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా సాగిన రోజుల్లో రాస్తారోకోలు, బంద్‌లు, దీక్షలు, మానవహారాలు, నిరసన కార్యక్రమాల్లో ముందుండి పోరాటం చేశారు. పలుమార్లు అరెస్టై పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. జైలు జీవితంఅనుభవించినప్పటికీ ఉద్యమ మార్గాన్ని వీడలేదు. గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమాన్ని విస్తరించడంలో ఆయన పాత్ర విశేషమని సహచరులుగుర్తుచేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన అభివృద్ధికి పెద్దపీట వేశారు. గ్రామీణ రహదారులు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.
2023 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ప్రజలతో అనుబంధాన్నికొనసాగించారు. అధికారంలో లేకున్నా గ్రామాల పర్యటనలు చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేశారు. అనారోగ్యంవేధిస్తున్నప్పటికీ ప్రజా జీవితానికి దూరం కాలేదు.

కన్నీరుమున్నీరైన నర్సంపేట డివిజన్
పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించేందుకు నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, సంగెం, నెక్కొండ, ఖానాపురం తదితర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. గులాబీ జెండాలు రెపరెపలాడుతుండగా జై తెలంగాణ పెద్ది అమర్ హై నినాదాల మధ్య అంతిమయాత్ర సాగింది. మహిళలు, రైతులు, యువకులు, వృద్ధులు భావోద్వేగంతో తమ అభిమాన నాయకుడికి తుది వీడ్కోలు పలికారు.
ప్రముఖుల నివాళులు
అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉద్యమ సహచరులు పాల్గొని నివాళులర్పించారు. ప్రజల రద్దీతో నర్సంపేట పట్టణం ఉద్యమ రోజులను తలపించింది.

స్వగ్రామం నల్లబెల్లిలో అంత్యక్రియలు
అనంతరం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన నల్లబెల్లికి తరలించారు. గ్రామస్తులు, అభిమానులు, ఉద్యమ సహచరులు భారీ సంఖ్యలో తరలివచ్చి చివరిసారిగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వేలాది మంది ప్రజల సమక్షంలో ప్రభుత్వ లాంఛనాలు లేకుండానే సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలునిర్వహించారు. గ్రామమంతా శోకసంద్రంగా మారగా, పెద్ది అమర్ హై నినాదాలతో ఆయనకు ప్రజలు తుది వీడ్కోలు పలికారు.

తీరని లోటు
తెలంగాణ ఉద్యమంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని ప్రజలు, ఉద్యమ సహచరులు పేర్కొన్నారు. పదవుల కంటే ప్రజల ప్రేమను గొప్పదిగా భావించిన ఆయన సేవలు, త్యాగాలు, నిరాడంబర జీవనం, కార్యకర్తల పట్ల చూపిన ఆప్యాయత చిరస్థాయిగా గుర్తుండిపోతాయని నాయకులు నివాళుల సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుందని వారు అన్నారు.

## ప్రతీ ఇల్లు పచ్చదనంతో కళకళలాడాలి.



**పాలేరు జూలై 31(నినాదం)** ప్రతీ ఇల్లు పచ్చదనంతో కళకళలాడాలని ఆచార్లగూడెం పంచాయతీ సర్పంచ్ కొలికపొంగు ఉప్పలమ్మ సూచించారు. నేలకొండపల్లి మండలం లోని ఆచార్లగూడెం పంచాయతీలో శుక్రవారం హరితహారం లో భాగంగా ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామం అంతా పచ్చదనంతో నిండాలన్నారు. ఇళ్లకు అందించిన మొక్కలను ప్రతీ ఒక్కరూ నాటటమే కాకుండా వాటని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం ను అందించేందుకు చెట్ల ను పెంచాలని సూచించారు. రహదారుల వెంట కూడ ఇరువైపులా మొక్కలు నాటి పచ్చని తివాచీ పరిచినట్లు గా ఉండేలా కార్యచరణ ను రూపొందించాలని సూచించారు. హరితహారం కార్యక్రమం కు పాలకవర్గం తో పాటు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నీటి పారుదల అభివృద్ధి పనులు
## శర వేగంగా పూర్తి చేయాలి.
ఇరిగేషన్ డీఈఈ జె.పొట్టయ్య





**పాలేరు జూలై 31(నినాదం):** నీటిపారుదల అభివృద్ధి నేలకొండపలి సబ్ డివిజన్ లో పనులను శర వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ డివిజన్ డీఈఈ జె.పొట్టయ్య పేర్కొన్నారు. మండల కేంద్రం లోని సబ్ డివిజన్ కార్యాలయం లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుమాధారంలో రూ40 లక్షలుతో తూముల వద్ద, ఆచార్లగూడెం లో కెనాల్ కల్వర్టు కు రూ. 3. 8 లక్షలు, ఆరెగూడెం కెనాల్ కు రూ. 6. 48 లక్షలు, బుద్దారం తూములు మరమ్మతుల కు నిధులు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. పనులు త్వరలోనే ప్రారంభించను న్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ లో కొత్తగా చెరువుమాధారం 1. 2 ఎత్తిపోతుల పథకం కు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మొదటి పథకం కు రూ. 3. 82 లక్షలు. రెండో పథకం కు 3. 33 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ లష్కర్స్,సిబ్బందితో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలువ కట్టలపై చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా పడితే. నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు ముందే కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంగాపురంతండా మేజర్ కాలువ కట్ట పై-ప్రతీ ఒక్కరూ సిబ్బంది షెడ్యూల్ ప్రకారం కంప చెట్లు తొలిగించే పనులు చేపట్టాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ లు నరేష్, రుత్విక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ది మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి
## గురిచేసింది: గోలి శ్రీనివాస్ రెడ్డి





**కల్వకుర్తి జూలై 31 (నినాదం):** ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం. ఉద్యమ ఆశయాలను విశ్వసిస్తూ, జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారు. అని పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు ఆయన మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు,తెలంగాణ సమాజానికే తీరని లోటు. ఆయన చూపిన నిబద్ధత,ఉద్యమ స్ఫూర్తి, ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావం పార్టీ శ్రేణులకు,భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను

## సాలురాలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



**బోధన్ ప్రతినిధి, జులై 31:(నినాదం):** సాలు రా మండల కేంద్రంలో బోనాల పండుగ ఉత్సవాలు, అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. మహిళలు ప్రతి ఇంటి నుండి బోనాలను ఎత్తుకొని డప్పు వాయిద్యాలు, పోతురాజు విన్యాసాలమధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. మహాలక్ష్మి, పోచమ్మ దేవతలకు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఉద్యమ ధీరుడు మృతి తీరనిలోటు
**ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**



**జవహర్ నగర్, జూలై 31(నినాదం):** తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన పెద్ది సుదర్శన్రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ తో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అండగా నిలిచేవాడని, ప్రజాసేవలో తనదైనముద్ర వేసుకున్నాడని పేర్కొన్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ వెన్నంటే ఉంటుందని, తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం
**క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**







**కామారెడ్డిప్రతినిధి, జూలై 31(నినాదం):** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని రోజులుగా నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి ఆవరణలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో పెద్ద చెరువు పూర్తిస్థా యిలో నిండి అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో చెరువు వద్ద సంప్రదాయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చెరువు పరిసరాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లను హెచ్చరించారు. ప్రజలు ప్రమాదవశాత్తు చెరువు వైపు వెళ్లకుండా తగిన బారికేడ్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. జీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ... "ప్రజల ప్రాణ భద్రతే జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యం. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. నీటి నిల్వలు, చెరువులు, కాలువలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి. ప్రజలు కూడా నిర్లక్ష్యం చేయకుండా అధికారుల సూచనలను పాటించి అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.
ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, స్థానిక కౌన్సిలర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్. హన్మంతరావు నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎ. వినీత్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సి. హెచ్. వేణుప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన సర్పంచ్ రేఖ సుదర్శన్





**భిక్కనూర్, జూలై 31 (నినాదం)** భిక్కనూర్ గ్రామంలోని 10వ, 11వ వార్డుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న బండి రమేష్, బట్టు లింగం ఇళ్లను గ్రామ సర్పంచ్ రేఖ సుదర్శన్ శుక్రవారం పరిశీలించారు. దెబ్బతిన్న ఇళ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ రేఖ సుదర్శన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు విజయ్‌కుమార్ గౌడ్, వార్డు సభ్యుడు సురేష్ గౌడ్, సిద్ధారెడ్డి, జీపీఓ కాశిరాం, పసుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని
## అనుమానాస్పద మృతి



**భీమదేవరపల్లి జూలై 31 (నినాదం):** హనుమ కొండ జిల్లా భీమదేవ రపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసు కుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్న ఎలిగేటి అక్షర (17) శుక్రవారం తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతికి గల కారణాలపై కుటుంబ సభ్యులు, స్థానికులను విచారిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. అక్షర గ్రామంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు వెల్లడించారు.

## కర్రె కనకమ్మ ఉద్యోగ విరమణ
**విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ**





**వలిగొండ, జూలై 31 (నినాదం):** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా 12 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన కర్రె కనకమ్మ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయుల బృందంతో కలిసి కనకమ్మను శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని, 12 సంవత్సరాలలో కనకమ్మ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి చేసిన కృషి ఎంతో గొప్పదని, ఆమె అంకితభావం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. అదేవిధంగా కనకమ్మ కుమారులు యాదగిరి, శ్రీశైలం వాళ్ల తల్లి గుర్తుగా పాఠశాల విద్యార్థులందరికీ వలిగొండ ఫ్రీ ప్రైమరీ స్కూల్ కర్రె కనకమ్మ అని ముద్రించిన స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. వారి చేసిన సేవా భావాన్ని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, తహసీల్దార్ దశరథ్, ఎంఈఓ సుంకోజు భాస్కర్, ఉపసర్పంచ్ మల్ల

## పాత కక్షల దాడి కేసులో ఇద్దరికీ జైలు

**ధర్మారం జూలై 31 (నినాదం):** మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మేకల మల్లయ్యను, మీనగు మల్లేష్ చంద్రయ్య ఇద్దరు కలిసి పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని మల్లయ్యను ఇనుప బకెట్ తో కొట్టగా మల్లయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి వేగా ఈ కేసు ఈరోజు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వీరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష పదివేల రెండు వందల ఫైన్ వేశారు. పోలీసుల తరఫున, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ సరైన సమయంలో సాక్ష్యం ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడేలా చేశాడని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపాడు.

## పెద్దికి మాజీ ఎమ్మెల్యే సండ్ర నివాళులు



**తల్లాడ, జూలై 31(నినాదం ):** నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవల అనారోగ్యం కి గురై హైదరాబాద్ యశోద హాస్పటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నర్సంపేట వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక గాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులు హార్పించి అంతిమ యాత్ర లో పాల్గొన్నారు. సండ్ర తో పాటు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు కుడా నివాళులు హార్పించడం జరిగింది. సండ్ర మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమ కారుదు ఆత్మీయ మిత్రుడు మంచి మనుసున్న పెద్ది సుదర్శన్ చనిపోవడం చాలా బాధాకరం, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు మరియు బంధువులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.




పెద్ది అంతిమయాత్రలో
## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
**-మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్ రావుతో కలసి కన్నీటి వీడ్కోలు పలికిన మాజీ మంత్రి**



**వనపర్తి ప్రతినిధి, జూలై 31 (నినాదం)** ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటనుండి నల్లబెల్లి మండల కేంద్రం వరకు లక్షలాది మంది పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానుల శోకసంద్రంతో అంతిమ యాత్ర సాగింది. ఈ అంతిమ యాత్రలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హరీష్ రావుతోపాటు పాల్గొని నివాళులు అర్పించారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహాన్ని చూసి చలించిపోయిన మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి భావోద్వేగానికి గురైయ్యారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలంగాణ ప్రజలు పెద్దినీ తమ గుండెల్లోనిలుపుకుంటారని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిరంజన్ రెడ్డి వెంట ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి ఉన్నారు

## కొండా లక్ష్మణ్ పై కేసు



జగిత్యాల, ఆగస్టు 31 (నినాదం): జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన వ్యవహారంపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. విజిలెన్స్ డ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బసవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా సివిల్ సప్లైస్ అధికారి ఎస్. జితేందర్ రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం నిర్వహించిన తనిఖీల్లో మూడు రైస్ మిల్లుల్లో ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. జిల్లాలోని శ్రీ అభయాంజనేయ స్వామి రైస్ మిల్, శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్లో జరిగిన తనిఖీల అనంతరం విజిలెన్స్ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ విచారణలో సుమారు రూ. 87 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా పక్కదారి మళ్లించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈనేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లుల యాజమాన్యాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశా రు. ఈ కేసులో మిల్లు యజ మాని కొండ లక్ష్మణ్తో పాటు మరికొందరిపై కూడా క్రిమి నల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి